RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 01 మే 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:280

## కార్మిక వర్గానికి అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు- సీఎం రేవంత్ రెడ్డి



మే డే(మే 1వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు.కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

## పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు!



హైదరాబాద్: ఏప్రిల్ 30: డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, తనదైన ముద్ర వేసిన డిజిపి బి. శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు.కార్యక్రమ ఆరంభంలో, శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డిజిపి మహేష్ ఎం. భగవత్ కు అప్పగించారు. నూతన డిజిపి గా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు, ఇన్చార్జ్ డీజీపీగా మహేష్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం, వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపిఎస్ అధికారులు, సిబ్బంది కి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు.అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి, అందరికీ చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపిఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని తాగుతుండగా, ఇతర సిబ్బంది డిజిపి పై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే, ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, టిఎస్ఎల్పిఆర్బి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయకుమార్ లతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా, ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

## ప్రభుత్వం భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి




హైదరాబాద్ రాష్ట ప్రభుత్వ సలహాదారుగా ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర డిజిపిగా ఉన్న ఆయన గురువారం పదవీ విరమణ చేసారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను ఉపయోగించుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం భద్రతా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## బీసీ సంక్షేమ & అభివృద్ధి సలహాదారుగా విహెచ్



హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వంలో కీలక నియామకం జరిగింది. మాజీ రాజ్య సభ్యుడు వి. హనుమంతరావును బీసీ సంక్షేమ ఒ అభివృద్ధి సలహాదారుగా నియమించింది. మంత్రివర్గ హోదాతో సలహాదారుగా బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రాధాన్యత క్రమంలో ప్రత్యేక స్థానం కల్పించింది. నెలకు రూ.1 లక్షల లంప్సమ్ జీతం, అదనంగా ప్రత్యేక, సౌకర్య భత్యాలు మంజూరు చేసింది. నివాసానికి ఉచిత గృహం లేదా హౌస్ రెంట్ అలవెన్స్, వాహనం, ఇంధనం కోసం ప్రత్యేక భత్యాలు, మెడికల్ సదుపాయాలు మంత్రుల స్థాయిలో ప్రైవేట్ సెక్రటరీ సహా సిబ్బంది ఏర్పాటు చేసింది. ఖర్చులు బీసీ వెల్ఫేర్ శాఖ బడ్జెట్ నుంచి భరింపు వుంటుంది. ఈ మేరకు జీఓ విడుదల చేసింది.

## డాకూర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ ను ప్రారంభించిన మంత్రి

### ప్రజలు డాక్టర్ సూచనలు లేకుండా పెయిన్ కిల్లర్లను వాడొద్దు
### ఆందోల్ ను హెల్త్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నాం
### రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా:**ఆందోల్ మండలం డాకూర్ గ్రామంలో ధర్మశాస్త్ర ఫౌండేషన్ - సహార హాస్పిటల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. క్యాన్సర్, డయాలసిస్, గుండె సంబంధ , (ఎన్ సి డి ) చికిత్స లను కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. డాకూర్ గ్రామానికి చెందిన ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు వెన్ను, కీళ్ల నొప్పుల కోసం డాక్టరు సూచనలు లేకుండా విరివిగా పెయిన్ కిల్లర్ మందు గోళీలు వాడటం వల్ల మూత్రపిండాల లో సమస్యలు వస్తాయని మంత్రి వెల్లడించారు. డాక్టర్ సూచనలు, మందుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందు గోలిలు వాడొద్దని సూచించారు. గ్రామ ప్రజలు వైద్య చికిత్సల కోసం దగ్గర్లో ఉన్న జోగుపేట ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డి లోని జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు ఉచితంగా







అందిస్తున్నామన్నారు ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు...

## జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

వార్తా 2 లో

### విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
### వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
### ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
### సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం: మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ముందుకు సాగాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. గురువారం నాడు హిమాయత్ నగర్ లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల పనుల సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, లక్ష్మణకుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపీలు, ఎంఎల్యేలు, ఎంఎల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్లు, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి గౌతమ్, కలెక్టర్లు, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అటవీ భూములకు సంబంధించిన అంశాలను ఆ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఫారెస్ట్ క్లియరెన్సుల కారణంగా ఇళ్ల నిర్మాణం కుంటుపడటానికి వీలు లేదని పేర్కొన్నారు. కలెక్షర్లు తమ విచక్షణాధికారాలను ఉపయోగించి ఫారెస్టు భూముల పరిహారం లాంటి అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కూడా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. కలెక్టర్లు నిబంధనల పేరుతో జాప్యం చేయకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఉపేక్షించేది లేదని శ్రీధర్ బాబు హెచ్చరించారు.

ప్రజాబలం

01 మే 2026 శుక్రవారం

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలిఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది.ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి.మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు.ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్దతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

## సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్: విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు.సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. × విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, ఎఉఃఅచిఖీఎఇూ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెస్ స్పిరిట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్ద గందరగోళ పరిస్థితి

## కాంట్రాక్టర్ సుప్రవైజర్ రవి నీ వెంటనే కంపెనీ నుంచి తొలగించాలి

## మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న రవి





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలో గల ఎస్, ఇటిక్యాల, గ్రామ శివారులోని, ఉన్నటువంటి ఎమ్మెస్ స్పిరిట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యందు, సుమారు మహిళా కార్మికులు 350 నుంచి 400 వరకు గత ఏడు సంవత్సరాల నుంచి కంపెనీలోపని చేస్తున్నారు, సదురు కాంట్రాక్టర్ శ్రీనివాస్ గౌడ్,కుసంబంధించిన, ప్రొడక్షన్ సూపర్వైజర్ రవి, కంపెనీలో పని చేసే మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా,ప్రవర్తిస్తున్నాడని, అలాగే మహిళలు అని చూడకుండా దురుసుగా మాట్లాడుతున్నాడని, ఇదే విషయమై ఎన్నిసార్లు, కంపెనీ మేనేజ్మెంట్ కు ఎన్నిసార్లు విన్నవించిన, తమను,పట్టించుకోవడంలేదని, కంపెనీ మేనేజ్మెంట్, కాంట్రాక్టర్ ఇద్దరు కుమ్మక్కై, మహిళా కార్మికులను అధిక శ్రమదోపిడి చేస్తున్నారని, కనీస సౌకర్యాలైన సేఫ్టీ గ్లౌజ్ ఈఎస్ఐ,పిఎఫ్, కనీసం కంపెనీలో అంబులెన్స్ సౌకర్యం లేకుండా, శ్రమ దోపిడీ చేస్తున్నారని, ఇలా మహిళ కార్మికుల పట్ల తరచూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నటువంటి, సూపర్వైజర్ రవి, ని వెంటనే కంపెనీ నుంచి తొలగించాలని, ఈరోజు గురువారం మహిళా కార్మికులు మొత్తం బయటే ఉండి ధర్నా చేశారు, మేనేజ్మెంట్ మాత్రం, ఏం చేస్తారో చేసుకోండి, నేను మాత్రం అతన్ని కంపెనీ నుంచి తొలగించను అని కారకండీగా చెప్పినట్లు సమాచారం, మహిళా కార్మికులు మాత్రం అతని వీదులోంచి తొలగించే వరకు మేము పనిచేయమని కూర్చున్నరు...

# ములుగు జిల్లా నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్‌పి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** ములుగు ములుగు జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్ఖడే ఐఏఎస్ ను జిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు.ఈ భేటీలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పని చేయాలని నిర్ణయించుకున్నారు.జిల్లాలో శాంతి భద్రత మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.జిల్లా ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యంగా కలిసి పనిచేయాలని ఇరువురు అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం లో ములుగు డి ఎస్ పి రవీందర్ ములుగు సి ఐ సురేష్ ఇన్స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

# కూకట్ పల్లి సర్వే నెంబరుతో ఖానామెట్ చెరువు కబ్జా..

## .కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ ఆందోళన.

## .కబ్జాల నుండి కాపాడకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్న సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలుఅధికారుల నిర్లక్ష్యం పై టి.రామకృష్ణ మండిపాటు





**శేరిలింగంపల్లి ప్రజాబలం ప్రతినిధి** నరేష్‌శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ చెరువును కొంతమంది బిల్డర్లు కబ్జా చేసి దానికి కూకట్ పల్లి సర్వే నెంబరు జత చేసి చెరువులు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, టి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి లోని భూములకు కోట్ల రూపాయల విలువ ఉండడంతో అక్రమ కబ్జాదారులు ఇట్టి భూములపై కన్ను వేసి లేని సర్వే నెంబర్లను సృష్టించి చెరువులను నాలాలను కుంటలను కనుమరుగు చేసి వేలకోట్ల రూపాయలను అర్జిస్తున్నా.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు నిమ్మకు నేరెత్తినట్టు వ్యవహరించడం ఏమిటని వారు నిలదీశారు. ఖమ్మం జిల్లా వెలగమట్లలో మన హైదరాబాదులో పేదలు నిర్మాణం చేసుకున్న పూరి గుడిసెలను రాత్రికి రాత్రే కూల్చేసిన హైడ్రా అధికారులు ధనవంతులు నిర్మాణం చేస్తే ఇండ్లు కనబడడం లేదా అని వారు ప్రశ్నించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే అక్రమ కబ్జాదారులపై కొరడా జులిపించి తక్షణమే కూల్చివేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లేకపోతే వారితో హైడ్రా కుమ్మక్ అయిందని ప్రజలు నమ్మే అవకాశాలు ఉన్నాయని అన్నారు. చిత్తశుద్ధి నిరూపించుకోవడానికి అయినా హైడ్రాధికారులు ఈ అక్రమ కబ్జాదారులపై కేసులు పెట్టి అరెస్టులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ అక్రమ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అలాగే హైడ్రాధికారులను కలిసి అప్పటికి చర్యలు తీసుకోకపోతే కోర్టుకు సైతం వెళ్తామని అన్నారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె. చందు యాదవ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కే. వెంకటస్వామి, పార్టీ నాయకులు తుపాకుల రాములు, ఖాసీం, వెంకటేష్, జెట్టి శ్రీను, తిరుపతయ్య, కిరణ్, బాలస్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు గోస తగులుతుంది.. కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర వీడాలి!

**మొలకెత్తిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనాలి.**
**ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కన్నీరు..**
**వ్యవస్థ కుప్పకూలిందనడానికి ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జి ఆత్మహత్యాయత్నమే నిదర్శనం.**
**కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదు?**
**రైస్ మిల్లర్లు, దళారుల కుమ్మక్కుపై వెంటనే చర్యలు తీసుకోవాలి.**
**రైతు గోస తగులుతుంది.. కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర వీడాలి.:**
**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఫైర్**



30 ఏప్రిల్, 2026యాదాద్రి భువనగిరి.హైద్రాబాద్ ఏప్రిల్ 30 తెలంగాణలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్య వైఖరి వల్ల ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిగా కుప్పకూలిందని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే అన్నదాతలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి మండలం హన్మాపూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బిజెపి కిసాన్ మోర్చా నాయకులతో కలిసి ఆయన పరిశీలించి, అక్కడి రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వెల్లబోసుకుంటూ.. 10 రోజులుగా లారీలు రాక, కాంటాలు లేక, కనీసం టార్పాలిన్లు కూడా లేకపోవడంతో ధాన్యం కుప్పలు మొలకెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర రథసారథి రాంచరద్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే, నల్లగొండ జిల్లా బచ్చన్నగూడెం ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జి కొప్పుల సైదులు మిల్లర్ల వేధింపులు, ప్రభుత్వ ఒత్తిడి తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయాల్సి వచ్చింది. తన ప్రాణత్యాగంతో అయినా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి కొనుగోళ్లు సజావుగా సాగాలని ఆయన మాట్లాడి, అనంతరం ఆత్మహత్యాయత్నం చేయడం ప్రతి ఒక్కరినీ కలచివేసిందన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని.. మోదీ ప్రభుత్వం, బిజెపి మీకు అండగా ఉంటుందని రాంచందర్ రావు భరోసా కల్పించారు.కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్రం ఎందుకు తాత్సారం చేస్తోంది?:ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మద్దతు ధరతో పాటు ట్రాన్స్‌పోర్ట్, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, హమాలీ చార్జీలు, చివరికి ఐకేపీ సెంటర్ల కమిషన్ కూడా కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. అయినప్పటికీ కొనుగోళ్లు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన అడ్డంకి ఏంటి? అని ప్రశ్నించారు.రైతు డిక్లరేషన్ ఉత్తదేనా?:వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు రైతులకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని విమర్శించారు. కనీసం టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం మొలకెత్తి బరువు తగ్గిపోతోందని, దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర దక్కకుండా పోతోందని మండిపడ్డారు. హన్మాపూర్‌లో దాదాపు 80-100కి పైగా ధాన్యం కుప్పలు రాశులుగా పోసి రైతులు వేచి చూస్తున్నప్పటికీ, కొనుగోళ్ల విషయంలో అధికారులు కేవలం మాటలతో సరిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మిల్లర్లు - దళారుల కుమ్మక్కు:రాష్ట్రంలో రైస్ మిల్లర్లు, దళారులు, కొంతమంది అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. ఆదిలాబాద్‌లో మక్క రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, మద్దతు ధర దేవుడెరుగు కనీసం కొనే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు చర్యలకు పాల్పడుతున్న మిల్లర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి మొలకెత్తిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని, లారీలు, గన్నీ బ్యాగుల కొరతను వెంటనే తీర్చాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలు ఉధృతం చేస్తామని రాంచందర్ రావు హెచ్చరించారు.

## మెడికల్ మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలి
## ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా సమితి డిమాండ్



నరసరావుపేట, పల్నాడు జిల్లాలో జరుగుతున్న మెడికల్ మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఒఎజఈ) పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయము ఎదుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఒఎజఈ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు మహంకాళి సుబ్బారావు,సుభాని మాట్లాడుతూ జిల్లాలో ఈ మధ్యకాలంలో హాస్పిటల్స్ మరియు కొంతమంది మెడికల్ స్టోర్లు ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ, ధనార్జన ధ్యేయంగా నకిలీ మందులు అమ్ముతున్నారని ఈ విషయం డ్రగ్ అధికారులకు తెలిసిన నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్నారని వారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజారోగ్యాన్ని సేవగా భావించకుండా వ్యాపారంగా మార్చి దోపిడికి పాల్పడుతున్నారని వారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల బలహీనతను ఆసరాగా చేసుకొని అవసరానికి మించిన బిల్లులు వేయటం, అవసరంలేని పరీక్షలు మరియు చికిత్సలు చేయించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిని దెబ్బతిస్తున్నారు. ఇక మరోవైపు జిల్లాలో కొంతమంది మెడికల్ స్టోర్లు చట్టాలను పక్కనపెట్టి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుమందుల విక్రయం, అనుమతి లేని అబార్షన్ మాత్రల రహస్య అమ్మకాలు లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులు నిర్వహణ వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఈ పరిస్థితి సాధారణ ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. లైసెన్స్ లేని మెడికల్ స్టోర్లను తక్షణమే సీజ్ చేయాలి. అన్ని మెడికల్ షాపులు, ప్రైవేట్ హాస్పిటల్స్ పై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్య తీసుకోవాలి, మెడికల్ షాపులో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా అనేదానిపై అధికారులు పరిశీలన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, నాగరాజు, బొంత పృథ్వి, కె.దుర్గా, జగదీష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చిలుకు స్వామికి శ్రమశక్తి అవార్డు



హైద్రాబాద్ ఏప్రిల్ 30 మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రేపు ప్రధానం చేయబోతున్న శ్రమశక్తి అవార్డులలోసౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోపరేటివ్ సోసైటీ అధ్యక్షునిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామి ని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రేపు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారి ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రధానము చేయనున్నారు ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి అయిన స్వామి ఒకవైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్తదానము శ్రమదానము శిబిరాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. వీరిసేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ మేడే సందర్భంగా శ్రమశక్తి అవార్డుకు ఎంపిక చేసింది. చిలుక స్వామికి ఈ గౌరవము లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పలువురు హర్షం వ్యక్తం చేశారు

## తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం




హైదరాబాద్ ఏప్రిల్ 30 తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. రాష్ట్ర సహ ఇంచార్జు రోషిణి జైస్వాల్, భవ్య గార్లతో కలిసి జిల్లాల వారీగా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నా విజయాన్ని ప్రస్తావిస్తూ ఇది సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. అదే స్ఫూర్తితో మే చివరిలోగా గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను పూర్తి చేసి యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు "చితిబిష్ట్ర ఎజఅ " యాప్‌పై అవగాహన పెంచాలని సూచించారు.శ్రీ రాహుల్ గాంధీ గారి పిలుపు మేరకు "గిగ్ వర్కర్ న్యాయ అభియాన్" కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, గిగ్ వర్కర్లను విస్తృతంగా నమోదు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.చురుకుగా పనిచేసే వారికి భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇస్తూ, సమావేశం ప్రారంభానికి ముందు మరణించిన సభ్యులకు నివాళులు అర్పించారు.

## నిరుపేద విద్యార్థికి లాప్‌టాప్ పంపిణీ: మానవత్వాన్ని చాటుకున్న సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మరియు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** ఏటూరు నాగారంబిపేదరికం విద్యకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలవడమే తమ లక్ష్యమని ఏటూరునగరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మరియు ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు.ఏటూరు నాగారం మండలానికి చెందిన 5 వ,వార్డుకు చెందిన జాడి రాజు కుమార్తె జాడి రాధిక, నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసిస్తున్నప్పటికీ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా లాప్ టాప్ కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని సర్పంచ్ శ్రీలత మరియు లక్ష్మణ్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. నేటి ఆధునిక విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని గుర్తించిన వారు, తక్షణమే స్పందించి తమ సొంత ఖర్చులతో సదరు విద్యార్థికి నూతన లాప్ టాప్‌ను అందజేశారు.× ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీ పడాలనే ఉద్దేశంతో ఈ సాయం చేయడం జరిగింది. నిరుపేద కుటుంబాల నుండి వచ్చే విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ తల్లిదండ్రులకు, మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని" వారు హామీ ఇచ్చారు. తమ ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకుని, వేల రూపాయల విలువ చేసే లాప్ టాప్‌ను బహుకరించినందుకు విద్యార్థి మరియు వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కు లక్ష్మణ్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.× ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు ఎండి వలీ బాబా, తాడూరి రఘు, కాకులమర్రి అరుణమ్మ,కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, వార్డు మెంబర్ కొండాయి చిన్ని, రెడ్డి ప్రమీల,దేపాక శ్రీరామ్, జాడి హరిబాబు, బాసాని శేఖర్, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏపీకి 11,056 కోట్లు..

## ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..

విజయవాడ, ఏప్రిల్ 30, ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు. కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు“ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి.. ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతున్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని” భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపెనీలకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు. ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు..

ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# సొంత ఇమేజ్ పై దివ్యదృష్టి...

కాకినాడ, ఏప్రిల్ 30, రాజకీయాల్లో వారసత్వాలకు కొదవలేదు. అది పురుషులైనా మహిళలైనా ఇటీవల కాలంలో రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పొలిటికల్ కెరీర్ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గం ఎమ్మెల్యే కీలకమని చెప్పాలి. గత ఎన్నికల్లో తుని నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి సీనియర్ మోస్ట్ నాయకుడు యనమల రామకృష్ణుడి కుమార్తె యనమల దివ్య పోటీ చేశారు.. విజయం కూడా దక్కించుకున్నారు. నిజానికి వైసీపీ ఇక్కడ బలంగా ఉంది. స్థానికంగా కూడా వివాదరహితంగా వైసిపి గత ఎన్నికల సమయంలో వ్యవహరించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ తునిలో వైసీపీ విజయం సాధిస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ దీనికి భిన్నంగా తుని పొలిటికల్ తెరపై తొలిసారి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య విజయం సాధించారు. పైగా ఆ సమయంలో సొంత కుటుంబంలోనే రెండు వర్గాలుగా ఏర్పడిన పరిస్థితి ఉంది, యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టిడిపి ఓటు బ్యాంకు చీల్చే ప్రయత్నం చేశారని పెద్ద ఎత్తున చర్చ కూడా సాగింది. యనమల దివ్య ఘన విజయం దక్కించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పుడు రెండు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత మరి ఆమె పరిస్థితి ఏ విధంగా ఉంది.. నియోజకవర్గం అభివృద్ధి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు ప్రజలకు అందుతున్న లబ్ధి వంటివి ఏ మేరకు దివ్యకు పేరు తీసుకు వస్తున్నాయి..

అనేది చూస్తే సానుకూల పరిణామాలే కనిపిస్తున్నాయని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.గత ఎన్నికల వరకు యనమల రామకృష్ణుడి పేరుతోనూ యనమల కుటుంబం పేరుతో రాజకీయాలు చేసిన దివ్య ఇప్పుడు సొంతంగానే తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి తోడు వైసిపి తరఫున కార్యక్రమాలు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనిపించని పరిస్థితి ఉంది. ఇది దివ్యకు మరింతగా కలిసి వచ్చింది. వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతురాలు అయిన దివ్య సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అధికారులను ముందుకు నడిపించే విషయంలోనూ చాలా విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ఆమె వేస్తున్న అడుగులు మంచి ఫలితాన్ని అందిస్తున్నాయి. ఎక్కడ ఎమ్మెల్యే పై వ్యతిరేకత కనిపించడం లేదు. సొంత పార్టీలోనూ కలివిడితనం స్పష్టంగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో ఎమ్మెల్యే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలి.

నియోజకవర్గంలో అభివృద్ధి విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ వ్యక్తిగత అంశాల విషయంలో కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞాపనలను కూడా ఆమె పరిశీలనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వరుసగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు అందిన ఎమ్మెల్యేల రిపోర్టుల్లో దివ్య తొలి 100 స్థానాల్లోనే ఉండడం విశేషం.

# కొంప ముంచుతున్న కృత్రిమ కొరత

కాకినాడ, ఏప్రిల్ 30, ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. విపక్షైసీపీఆయకులునిపై నిరసనలు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏపీలో ఈ పరిస్థితి నెలకొందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి కొరత లేదని కూటమి అధికారంలో ఉన్న ఏపీలో మాత్రం ప్రజలకు పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యకు ప్రధాన కారణాలు పానిక్ కొనుగోళ్లు, సరఫరా ఆలస్యాలు, పరిశ్రమల డిమాండ్ మార్పులు అని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4,500కి పైగా పెట్రోల్ బంకుల్లో 10?70 శాతం మూతపడ్డాయి. కర్నూలు, నంద్యాల్, గోదావరి, విశాఖలో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. రోజువారీ 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9 వేల కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలకు 50 శాతం అధిక డిమాండ్ ఏర్పడటంతో సంక్షోభం తీవ్రమైంది. దొరకదనే కారణంతో చాలా మంది అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు.పానిక్ భయంతో అనవసర కొనుగోళ్లు పెరగడం కొరతకు ప్రధాన కారణం. సాధారణ అమ్మకాలకు రెట్టింపు డిమాండ్ వచ్చింది. పారిశ్రామికులు అధిక ధరల కారణంగా రిటైల్ డీజిల్కు మారారు, వ్యవసాయ రంగంలో కూడా డిమాండ్ పెరిగింది. యుద్ధాలు, ఆయిల్ కంపెనీల రెండు రోజుల ఆలస్య సరఫరా, క్రెడిట్కు బదులు క్యాష్ డిమాండ్ కృత్రిమ కొరతను మరింత పెంచాయి.సీఎం చంద్రబాబు పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. అధిక సరఫరా కోరారు. . మంత్రి నాదెండ్ల మనోహర్ కొరత లేదని, పోయోకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు సంస్థల సరఫరా ఆగిపోవడంపై కూడా చర్చించారు.పానిక్ కొనుగోళ్లు తగ్గిస్తే సమస్య త్వరగా సద్దుమణుగుతుంది. ఆయిల్ కంపెనీలు సరఫరాను మెరుగుపరచాలి, పరిశ్రమలకు ప్రత్యేక సరఫరా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం డీలర్లను పరిగణనలోకి తీసుకుని, పారదర్శకత పెంచాలి.

పొలిటికల్ మైలేజ్ కోసం వైసీపీ

ప్రజా సమస్యల పట్ల పోరాడాల్సిన అవసరం ప్రతిపక్ష పార్టీకి ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాల్సిన బాధ్యత కూడా ప్రతిపక్ష పార్టీ మీద ఉంటుంది. కానీ ఏపీలో ఇందుకు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. 2024 ఎన్నికల్లో అక్కడ కూటమి జోరు ముందు వైసిపి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవలసిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది.. ఏపీలో కూటమి ప్రభుత్వానికి సమాంతరంగా మరో పార్టీ లేదు కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ అక్కడ తుడిచి పెట్టుకుని పోయింది కాబట్టి.. వైసిపి నే అనధికారికంగా ప్రతిపక్ష హోదాలో ఉంది. ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.జగన్మోహన్ రెడ్డి ఆ మధ్య రైతుల సమస్యల మీద ధర్నాలు చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక అనధికారిక ప్రతిపక్ష నాయకుడిగా అది ఆయనకు లభించిన గౌరవం. ఆయన ఆ పని చేయాలి కూడా.. కాకపోతే ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని చెప్పి ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు చేస్తే జనం అసలు సహించరు.ప్రస్తుతం మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటికీ ఇరాన్ హార్మోజ్ జలసంధి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ జల సంధి మీదుగా సరుకు రవాణా కావడం లేదు. యుద్ధం నిలిపివేతకు సంబంధించిన చర్చలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. కేవలం మన దేశం మాత్రమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు మధ్య ఆసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే బ్యారెల్ ముడి చమురు ధర పెరిగింది. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. తగిన ఇంధన నిల్వలు ఉన్న నేపథ్యంలో కంపెనీలు కూడా పెద్దగా రేట్లు పెంచలేదు. అయితే కమర్షియల్ డీజిల్ ధర పెరిగిన నేపథ్యంలో.. మిగతా డీజిల్ కు డిమాండ్ పెరిగింది.

పైగా ఆయిల్ కంపెనీలు సప్లై తగ్గించాయి. దీంతో డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంకుల వద్ద ప్రజల క్యూలు కడుతున్నారు. ఇదే క్రమంలో పానిక్ బయింగ్ పరిస్థితి ఏర్పడింది. ఇది దేశం మొత్తం మీద ఉంది.ఈ పరిస్థితికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కారణమని ట్విట్టర్లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. పైగా ఒక వీడియోను విడుదల చేశారు. వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా విపత్కర పరిస్థితి ఉంటే చంద్రబాబు ఏం చేస్తారు.. చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల ఏపీలో ఇంధన కొరత ఏర్పడిందని జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం ఎంతవరకు న్యాయం.. అసలు ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయడం అవసరమా.. ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు చేస్తారా.. ఇప్పుడు ఇవే ప్రశ్నలను కూటమి నేతలు సంధిస్తున్నారు.. ఇప్పటికైనా జగన్ తను తీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

# సొంత నియోజకవర్గాలపై దృష్టి

విజయవాడ, ఏప్రిల్ 30, ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎమ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# యాక్షన్ మోడ్ లోకి కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 30, రంగంలోకి కేటీఆర్.. ఫస్ట్ స్టెప్లోనే సంచలన నిర్ణయం! బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉన్న కేటీఆర్కు.. 'సంపూర్ణ బాధ్యతలు' అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉన్న కేటీఆర్కు.. 'సంపూర్ణ బాధ్యతలు' అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. రాష్ట్ర స్థాయి కమిటీని అలానే ఉంచి.. జిల్లా, మండల స్థాయి కమిటీలను వెంటనే రద్దు చేశారు. ఇదేసమయంలో తన విచక్షణ మేరకు కీలక నేతలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో తొలి అడుగుగా.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కేటీఆర్ దృష్టి పెట్టారు. దీనిలో జరిగే అవకతవకలను గుర్తించే బాధ్యతను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్కు అప్పగించారు.హైదరాబాద్, సికింద్రాబాద్లో చేపట్టిన సర్ ప్రక్రియలో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపే ప్రమాదం ఉందని.. బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించే అవకాశం ఉందని కేటీఆర్ అంచనా వేశారు. ఈ క్రమంలో నకిలీ ఓట్లు, దొంగ ఓట్లను గుర్తించడం తోపాటు.. బీఆర్ ఎస్ అనుకూల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలని తలసానికి కేటీఆర్ సూచించారు. దీనికి సంబంధించి పార్టీ తరఫున కార్యకర్తలను నియమించుకుని పర్యవేక్షించే అవకాశం ఆయనకు కల్పించారు. ఏ ఒక్క బీఆర్ ఎస్ సానుకూల ఓటు కూడా పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు.గత ఏడాది జరిగిన.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలో బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించారని.. అందుకే తాము నష్టపోయామని చెప్పారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియను అత్యంత నిశితంగా పరిశీలించాల ని సూచించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలపైనా కేటీఆర్ ముందస్తుగానే సమీక్షలు నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేరకు సానుకూలత ఉందన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువె ళ్లాలని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉండే నాయకులే గుర్తింపు ఉంటుందని తేల్చేశారు. తన సోదరి కవిత రాజకీయాలు.. ఆమె పెట్టుకున్న టీఆర్ ఎస్ పార్టీపైనా కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. కొత్త పార్టీ అని పిలుస్తూ.. “కొత్త పార్టీలపై ఎవరూ స్పందించొద్దు. సమయం, సందర్భం చూసుకుని కేసీఆర్ సర్ స్పందిస్తారు. అప్పటి వరకు ఓపికగా ఉండండి. ఎన్ని పార్టీలు వచ్చినా.. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో రెచ్చిగొట్టే వ్యాఖ్యల విషయంలో మీరు అప్రమత్తంగా ఉండండి“ అని నాయకులకు తేల్చి చెప్పారు. త్వరలోనే జిల్లాలు, మండలాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

# కాళేశ్వరంపై రేవంత్ మార్క్ యుద్ధం



హైదరాబాద్, ఏప్రిల్ 30, తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు.సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులపై విచారణలు న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుపోతుంటాయి. దీనిని ముందుగానే పసిగట్టిన రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తాజాగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సీబీఐ సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడింది. దీనికి బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. 9 నెలల కిందటే పంపిన ఈ సిఫారసు ద్వారా సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక అడ్డంకులను ప్రభుత్వం తొలగించింది. వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా కక్షసాధింపు అనే ముద్ర పడి సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిన ఈ కుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, “మోదీ-కేసీఆర్ ఒక్కటే” అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలోకి వెళ్తుంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు వస్తాయి.కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, రేవంత్ రెడ్డి స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవాలని లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను స్వయంగా అందజేయడం ద్వారా దర్యాప్తును అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించడం ఖాయం. రేవంత్ రెడ్డి పన్నిన ఈ చక్రవ్యూహం నుండి ప్రత్యర్థులు ఎలా బయటపడతారో వేచి చూడాలి.

# తెలంగాణలో భారీగా నిరుద్యోగం

హైదరాబాద్, ఏప్రిల్ 30, ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025-26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది.2022లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్న ఉద్యోగాల్లో కోతలు నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం , జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానే రాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్

కరీంనగర్, ఏప్రిల్ 30, కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీ ఎక్కువ. ఒక నేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు. ఒకరి ఆధిపత్యాన్ని మరోకరు సహించరు. ఎవరికి వారు గ్రూపులుగా ఉంటారు. అవసరమైతే అధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాత కలిసే ఉంటారు. ఏమన్నా అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళ్లు కయ్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడుతున్నాయి. తాజాగా కరీంనగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది.వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదాలు బహిర్గతమై, గొడవల వరకు వెళ్లింది.మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14 సీట్లకే పరిమితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈ వివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది.అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో మూడో స్థానానికి మాత్రమే పరిమితమవుతుంది.

# బీజేపీని నిండా ముంచుతున్న అన్నాడీఎంకే

చెన్నై, ఏప్రిల్ 30, మిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ని పక్కన పెట్టింది. ఏఐడీఎంకే చెప్పినట్టుగా సీట్లకు ఒప్పుకొంది. అన్ని విధాలుగా.. అన్ని అంశాలలో రాజీ పడింది. వాస్తవానికి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. బిజెపికి తమిళనాడులో ఏమి చేయలేని పరిస్థితి. అందువల్లే ఏఐడీఎంకే ఆడించినట్టు ఆడింది. ఇంత చేసినప్పటికీ ఏమైనా ఉపయోగం ఉందా అంటే.. అది పలుచూపుమేరలో కూడా కనిపించడం లేదు.ఎగ్జిట్ పోల్స్ లో ఏ సంస్థ కూడా ఏఐటీఎంకే అధికారాన్ని దక్కించుకుంటుందని ప్రకటించలేదు.. పీపుల్ పల్స్ నుంచి మొదలు పెడితే చాణక్య స్ట్రాటజీస్ వరకు ప్రతి సంస్థ కూడా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. ఇక్కడ ద్రావిడ సెంటిమెంట్ ముందు జాతీయవాదం పనిచేయదని నిరూపించాయి. తమిళనాడు రాష్ట్రంలో 180 ప్లస్ సీట్లతో డిఎంకె కూటమి విజయం సాధిస్తుందని స్మార్ట్ పోల్ సంస్థ ప్రకటించింది. ఇందులో ఏ ఐ డి ఎం కే కూటమికి కేవలం 28 సీట్లు మాత్రమే వస్తాయని ప్రకటించింది. ఓటు షేర్ విషయంలో కూడా కేవలం 27.6 చేత మాత్రమే లభిస్తుందని స్పష్టం చేసింది. మాట్రిజ్ సంస్థ భిన్నమైన ఫలితాన్ని చెప్పినప్పటికీ.. ఈ సంస్థకు అంత గొప్పగా క్రెడిబుల్టి లేదు. ఈ సంస్థ ఏఐడీఎంకే కూటమికి 87 నుంచి 110 సీట్లు వస్తాయని ప్రకటించింది.యాక్సిస్ మై ఇండియా సంస్థ ఏఐడీఎం కే కూటమికి 22 నుంచి 32 స్థానాలకు వస్తాయని వెల్లడించింది.. చాణక్య స్ట్రాటజీస్ కూడా ఏఐడీఎంకేకు తమిళనాడులో అధికారం రాదని స్పష్టం చేసింది. ఈ కూటమికి కేవలం 50 నుంచి 65 స్థానాలు మాత్రమే వస్తాయని వెల్లడించింది. వాస్తవానికి బిజెపి అధినాయకత్వం తమిళనాడు విషయంలో అంతగా చొరవ చూపలేదని తెలుస్తోంది. వెస్ట్ బెంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రచారం చేశారు. అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అదే దూకుడు తమిళనాడులో కొనసాగించలేకపోయారు. పైగా బిజెపి రాష్ట్ర నేతలు ఇక్కడ తలా ఒక దిక్కుగా మారిపోయారు.అన్నామలై మాటకు విలువ లేకపోవడంతో ఆయన ఎన్నికల్లో టచ్ మీ నాట్ అన్నట్టుగా వ్యవహరించారు. కొత్త అధ్యక్షుడు లేకి వ్యాఖ్యలు చేసి.. తమిళ హీరో విజయ్ కి క్షమాపణలు చెప్పారు. ఇక ఏఐడీఎంకే నేతలు కూడా ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు జరిపారు. అత్యంత కఠినమైన సీట్లను బిజెపికి ఇచ్చారు.ఈ విషయాన్ని బిజెపి అధినాయకత్వంతో స్థానిక నాయకులు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా తమిళనాడు ఎన్నికల్లో ఏఐడీఎం కే కూటమి మరోసారి విఫల బృందంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

### పల్నాడు సిఐ బలత్కారం చేశాడంటూ పోలీసులకు మహిళ ఫిర్యాదు.
### కేసు నమోదు చేసిన పోలీసులు

పల్నాడు సీఐ చిన్నమల్లయ్య బలవంతంగా బలత్కారం చేసాడని పోలీసులకు మహిళ ఫిర్యాదు చేయడంతో పల్నాడు పోలీసులు కేసు నమోదు చేసి మహిళను పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గతంలో వినుకొండలో సీఐగా విధులు నిర్వహించిన చిన్న మల్లయ్య వద్ద తాను స్థలం అద్దెకు తీసుకుని, నాటుకోళ్ల ఫారం నిర్వహిస్తున్నట్లు తెలిపిన మహిళ అక్కడ ఉంటున్న తన నివాసానికి సీఐ చిన్నమల్లయ్య వచ్చి, తలుపు గడియ పెట్టి, బలవంతంగా బలత్కారం చేసాడని.. న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపిన మహిళ కేసు నమోదు చేసుకొని, వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మెట్రో మైలు రాళ్లు...

హైదరాబాద్, ఏప్రిల్ 30, భాగ్యనగర మెట్రో రైలు ప్రయాణాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల 24వ తేదీ నాటికి మెట్రో రైలు ప్రారంభమైనప్పటి నుండి మొత్తం ప్రయాణీకుల సంఖ్య 850 మిలియన్లకు (85 కోట్లు) చేరుకుంది. గత ఏడాది డిసెంబర్ 19న ఈ సంఖ్య 800 మిలియన్లుగా ఉండగా, కేవలం 126 రోజుల వ్యవధిలోనే మరో 50 మిలియన్ల (5 కోట్లు) మంది మెట్రోలో ప్రయాణించారు. ప్రస్తుతం సగటున రోజుకు 3.96 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు.గతంలో రోజువారీ సగటు ప్రయాణీకుల సంఖ్య 4.50 లక్షల వరకు ఉండేదని, అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత మెట్రో ప్రయాణీకుల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టినట్లు ఎల్ అండ్ టీ మెట్రో వర్గాలు భావిస్తున్నాయి. దీనికి తోడు మెట్రో స్టేషన్ల వద్ద 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ' (స్టేషన్ల వరకు చేరుకునే రవాణా సౌకర్యాలు) సరిగ్గా లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపంగా కనిపిస్తోంది.ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె సమయంలో బస్సులు నిలిచిపోయినప్పటికీ, మెట్రోలో ఆశించిన స్థాయిలో రద్దీ పెరగకపోవడం అధికారులను ఆశ్చర్యపరిచింది. సమ్మె తొలిరోజున గరిష్టంగా 4.90 లక్షల మంది ప్రయాణించినా, ఆ సంఖ్య 5 లక్షల మార్కును దాటలేకపోయింది.మెట్రోలో ప్రయాణీకుల సంఖ్యను పెంచేందుకు సమయాల్లో మార్పులు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.ప్రస్తుతం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్న సర్వీసులను, ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ వంటి రైల్వే స్టేషన్లకు వచ్చే దూరప్రాంత ప్రయాణీకులకు ఇది ఎంతో మేలు చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాత్రి 11 గంటలకే నిలిచిపోతున్న సేవలను కనీసం అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించాలని కోరుతున్నారు.ఈ సూచనలను పరిశీలించాలని మెట్రో రైలు ఎండీకి ప్రభుత్వం సూచించింది. సరైన రవాణా అనుసంధానం , సమయాల మార్పు చేపడితే మెట్రో మరింత లాభదాయకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జయమ్మ బాటలో కవితమ్మ...



నిజామాబాద్, ఏప్రిల్ 30, మనసులో మాట.. అంటూ కొత్తగా తెలంగాణ రాష్ట్ర సేన(టీఆర్ఎస్) పార్టీని ప్రారంభించిన కవిత కీలక ప్రకటన చేశారు. అదే 'తెలంగాణ తల్లి'గా తాను ఉండాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సహజంగా ఇది తమిళనాడులో మాత్రమే చెల్లింది. అక్కడ ఉమ్మడి పార్టీ అంటే ద్రవిడ పార్టీ నుంచి అన్న డీఎంకే విడిపోయినప్పుడు.. ఎంజీఆర్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన జయలలిత(జయమ్మ) తనకంటూ ఒక సొంత కుంపటిని ఏర్పాటు చేసుకునే క్రమంలో తమిళ ప్రజలకు తల్లిగా పరిచయమయ్యారు.ఇలాగే ఆవిడ కూడా తనను తల్లిగా భావించాలని కోరుకున్నారు. తమిళనాడు ప్రజలు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే.. ఆవిడ నటిగా తమిళ ప్రజల గుండెల్లో ఉన్నారు కాబట్టి అది సాధ్యమైంది. అప్పటికే వందలాది సినిమాల్లో ఆమె నటించారు. తమిళ ప్రజలను ఆకట్టుకున్నారు. కాబట్టి ఆమెను తల్లిగా భావించారు. అది సక్సెస్ అయింది. ఇప్పటికీ జయలలిత విగ్రహాలతో ఆలయాలు కట్టిన గ్రామాలు కూడా ఉన్నాయి తమిళనాడులో. కానీ ఆ పరిస్థితి కవితకు వస్తుందా.. ఆమె కామె అనుకుంటే తల్లిగా రిసీవ్ అవుతారా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలంగాణ సమాజం ఒక విభిన్నమైన ఆలోచనతో ఉంటుంది. సెంటిమెంటు అంటే అది వ్యక్తిగత సెంటిమెంటు కంటే కూడా సమాజ సెంటిమెంటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఒక ఘటనను తీసుకుంటే.. కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారుఇంతలో ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారంతో ఆయన దీక్ష విరమణ చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ సమాజం తిరగబడే పరిస్థితి వచ్చింది. ఇంక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ దీక్షను కొనసాగించారు. అటువంటి సెంటిమెంటు ఉన్న తెలంగాణలో 'నేను అమ్మ'ని అని పరిచయం చేసుకోవడం వరకు బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ సమాజం ఏ మేరకు దీన్ని ఆహ్వానిస్తుంది అనేది ప్రశ్న. ఇప్పటివరకు కవిత అంటే కెసిఆర్ కుమార్తె గానే చూశారు. ఒక ఎంపీగా ఒక ఎమ్మెల్సీగా ఒక రాజకీయ నాయకురాలుగా ఒక జాగృతి అధ్యక్షురాలుగా చూశారే తప్ప అకస్మాత్తుగా 'నేను అమ్మ'ని అని ఆవిడ చెప్పినంత మాత్రాన తెలంగాణ సమాజం ఆ రకంగా రిసీవ్ చేసుకోవడం కష్ట సాధ్యం. అంతేకాదు ఆవిడ చెప్పినంత తేలికగా తెలంగాణ సమాజం కవితను అమ్మగా చూసే పరిస్థితి కూడా ఉండదు. ఎవరికి ఉండే అంచనాలు వారికి ఉంటాయి తప్పేమీ కాదు. కానీ.. ఎక్కువగా ఊహించుకుంటేనే ప్రమాదం. ఈ విషయంలో కవిత ఆలోచించుకుని అడుగులు వేయడం ఉత్తమమని పరిశీలకులు చెబుతున్నారు.

# మే చివరి వారంకానీ జూన్ లో పంచాయితీ పోల్స్ కు ఏర్పాట్లు

విజయవాడ, ఏప్రిల్ 30, ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వం ఈ వేసవిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది.

అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించుకోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదలవ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన , రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయం తర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ ఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే, అధికార పార్టీపై సానుకూలత ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాలకవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది.

అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల సవరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# అన్న ప్రేమ వ్యవహారంలో చిక్కుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తూ, స్థానికంగా ఒక గదిలో అద్దెకు ఉంటున్న ధారూరు ప్రాంతానికి చెందిన దేగావత్ తులసీబాయి(23) అనే యువతి అత్మహత్య చేసుకుంది.

మృతురాలి అన్న రాజు ఓ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్గా పనిచేస్తూ, అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న మౌనిక అనే యువతిని ఏడాది కాలంగా ప్రేమిస్తూన్నాడు. ఆమెను తన చెల్లి గదిలోనే ఉంచాడు. ప్రేమికుల మధ్య గొడవలు జరిగి మౌనిక వెళ్లిపోయింది. అయితే గతంలో దిగిన ఫోటోలు పంపి మౌనికను రాజు బెదిరిస్తున్నాడు. దీంతో రాజు తనను వేధిస్తున్నాడని అందుకు అతని కానిస్టేబుల్ చెల్లి కూడా సహకరిస్తుందని మౌనిక వికారాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తన అన్న ప్రేమ వ్యవహారం వల్ల తాను ఇబ్బంది పడాల్సి వస్తుందని మనస్తాపంతో తులసిబాయి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తులసీబాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇవాళ్టి నుంచి సర్కారీ మెట్రో...




హైదరాబాద్, ఏప్రిల్ 30, హైదరాబాద్ మహానగర ముఖ చిత్రాన్ని మార్చేసిన లక్షలాది మందికి చేరువైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం కింద లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ, ఇప్పుడు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ వశమైంది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోగా మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చింది.. ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న మొత్తం వంద శాతం ఈక్విటీని 1, 461.47 కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డీకే సేన్, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో మాజీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సాక్షులుగా ఉన్నారు అంతకు ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ ప్రక్రియపై చర్చించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడంలో కేవలం వాటాలను కొనుగోలు మాత్రమే కాకుండా భారీ ఆర్థిక బాధ్యతలను కూడా ప్రభుత్వం స్వీకరించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి ఎల్ అండ్ టీ మెట్రోపై ఉన్న 13, 538.53 కోట్ల అప్పును ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ఈ లావాదేవీ పూర్తి అయిన తర్వాత ఎల్ అండ్‌టీ ఈ మెట్రో ప్రాజెక్టుతో ఎటువంటి అనుబంధం ఉండదు. ఈ ప్రక్రియ జూన్ 30 నాటికి పూర్తి కావచ్చని అంచనా. ఈ భారీ లావాదేవీకి ఐడీబీఐ క్యాపిటల్ టాన్సాక్షన్ అడ్వైజర్‌గా, సరఫ్ అండ్ పార్టనర్స్ లీగల్ అడ్వైజరీగా వ్యవహరించాయి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం 2010లో ప్రారంభమైంది. మొదట మేటాస్ కన్సార్షియం ఈ టెండర్ పొందినా, సత్యం కుంభకోణం తర్వాత అది రద్దు అయ్యింది. 2010లో జరిగిన రెండో టెండర్లలో ఎల్ అండ్ టీ అత్యంత తక్కువ కోట్ చేసి ప్రాజెక్టును దక్కించుకుంది. అప్పట్లో ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 71 కిలోమీటర్ల మేర ప్రాజెక్టు అంచనా వ్యయం మొదట 12, 132 కోట్లు కాగా, పూర్తి అయ్యే సరికి ఇది పెరిగింది. బ్యాంకుల నుంచి 11, 478 కోట్ల రుణం, ఎల్ అండ్ టీ వాటా 3,440 కోట్లుగా ఉంది. మొదటి దశ 2017నవంబర్ 29న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో సేవలు అందుతున్నాయి.

ప్రభుత్వ స్వాధీన నిర్ణయానికి కారణాలు ఇవే

ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి, ప్రభుత్వం దీనిని స్వీకరించడానికి బలమైన కారణాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆరు నెలలపాటు మెట్రో నిలిచిపోవడంతో ప్రాజెక్టు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం అప్పట్లో 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని కూడా ఇచ్చింది. మొదట 35 ఏళ్ల ఒప్పందం ఉండగా, దానిని 2072 వరకు అంటే మరో పాతికేళ్లు పొడిగించారు. అయితే ఆర్థిక ఒత్తిడి కారణంగా ఎల్ అండ్ టీ తప్పుకోవాలని భావించింది. మొదటి దశ ప్రైవేటు వద్ద, రెండో దశ ప్రభుత్వం వద్ద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు రెండు దశలూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండటం వల్ల సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడం సులభమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదు అయ్యాయి. మెట్రో ప్రభుత్వపరమవ్వడం వల్ల భవిష్యత్‌లో కొత్త మెట్రో లైన్ల నిర్మాణం పాత కారిడార్ల అనుసంధానం వేగవంతం అవుతుంది. ప్రయాణికుల అవసరాలు అనుగుణంగా ఛార్జీలు, సమయపాలన, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి మెట్రోను అనుసంధానించే ప్రక్రియ మరింత సులభతరం చేయవచ్చు.

# సోషల్ మీడియా తీర్పే ఫైనలా..?

## అన్‌ఫాలోలే రాజకీయ భవిష్యత్తుకు సంకేతమా..?

## రాఘవ్ చద్దాకి కొత్త పరీక్ష..

## పార్టీ మారిన కొన్ని గంటల్లోనే ఇన్‌స్టాలో 10 లక్షలకు పైగా అన్ ఫాలో...చెడ్డ రాజకీయాలు..!

## ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు..

.దేశ రాజకీయాల్లో యువ నాయకత్వానికి ప్రతీకగా ఎదిగిన రాఘవ చద్దా తాజా పరిణామాలతో మరోసారి చర్చల్లో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) 10 లక్షలకుపైగా ఫాలోవర్స్ అన్‌ఫాలో చేయడంపై రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీనిని కేవలం డిజిటల్ పరిణామంగా గాక ప్రజాభిప్రాయంలో వచ్చిన ప్రతిస్పందనగా భావించాల్సిన పరిస్థితి. నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రజా అనుసంధానానికి నాయకులకు ప్రధాన వేదికగా మారిన నేపథ్యంలో, ఈ తరహా భారీ అన్‌ఫాలోలు విశ్వాసంలో వచ్చిన చీలికను స్పష్టంగా చూపిస్తున్నాయి.చద్దా ఎదుగుదలకు యువతే ప్రధాన బలం. పార్లమెంటరీ చర్చల్లో చురుకుదనం, మీడియా కమ్యూనికేషన్ నైపుణ్యం, పట్టణ యువతతో సాన్నిహిత్యం వంటి అంశాలు అతనికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. అలాంటి నాయకుడిపై ఒక్కసారిగా డిజిటల్ వ్యతిరేకత వెల్లువెత్తడం, యువత రాజకీయ ఆలోచనల్లో వస్తున్న మార్పుకు సంకేతంగా చూడాలి. పార్టీ మార్పు రాజకీయాల్లో సాధారణమే అయినప్పటికీ, సిద్ధాంతపరమైన స్పష్టత లేకుండా జరిగితే అది అవకాశవాదంగా ముద్రపడే ప్రమాదం ఉంది. ఈ సందర్భంలో అన్‌ఫాలోల సంఖ్య, యువతలో పెరుగుతున్న విలువాధారిత రాజకీయ అవగాహనను ప్రతిబింబిస్తోంది. రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానంగా సోషల్ మీడియా .. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం ప్రచార సాధనం కాదు, అది రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానం. ఎన్నికల ముందు సర్వేలు, జనసభలు ఎంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయో, ఇప్పుడు డిజిటల్ స్పందన కూడా అంతే ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పట్టణ, మధ్యతరగతి, చదువుకున్న యువతలో అభిప్రాయాల మార్పు వేగంగా ప్రతిఫలిస్తోంది. ఒక నాయకుడి నిర్ణయం నచ్చకపోతే వెంటనే అన్‌ఫాలో చేయడం ద్వారా అసమ్మతి వ్యక్తం చేసే సంస్కృతి బలపడుతోంది. ఇది భవిష్యత్ రాజకీయ ప్రచార శైలిని కూడా మార్చే సూచన.ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి?జాతీయ రాజకీయాల దృష్టిలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పార్టీ మార్పులు ఇప్పటి వరకు వ్యూహాత్మకంగా మాత్రమే పరిగణించబడ్డాయి. కానీ ఇప్పుడు అవి ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి. ఒకవైపు పాత మద్దతుదారులు దూరమవడం, మరోవైపు కొత్త పార్టీలో పూర్తి స్థాయి ఆమోదం ఆలస్యమవడం రెండు పడవల మధ్య పరిస్థితిని సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పంజాబ్ వంటి ప్రాంతాల్లో చద్దా వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతింటే, అది స్థానిక రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే సోషల్ మీడియా ప్రతిస్పందనలను పూర్తిగా తుది తీర్పుగా పరిగణించడం సరైంది కాదు. రాజకీయాల్లో సంస్థాగత బలం, కేడర్ మద్దతు, నాయకత్వానికి దగ్గరదనం, వ్యూహాత్మక ప్రాధాన్యత వంటి అంశాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే బీజేపీ వంటి జాతీయ పార్టీలో నాయకుడి స్థానం కేవలం ఫాలోవర్స్ సంఖ్యలపై ఆధారపడదు. కానీ డిజిటల్ ప్రతికూలతను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరం.విశ్వాసం కోల్పోవడం క్షణాల్లోనే.. నిలబెట్టుకోవడమే కష్టం...ఏది ఏమైనప్పటికీ ప్రజల విశ్వాసం సంపాదించడం కష్టం, కోల్పోవడం మాత్రం క్షణాల్లో జరుగుతుందన్న విషయాన్ని తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లో చద్ధా అన్‌ఫాలోల ఘటన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. డిజిటల్ యుగంలో నాయకులు తీసుకునే ప్రతి నిర్ణయం వెంటనే ప్రజా పరిశీలనకు లోనవుతోందని తెలియజేసింది. కాబట్టి స్పష్టమైన రాజకీయ ధోరణి, విలువలపైన నిలబడే ధైర్యం, ప్రజలతో నిరంతర కమ్యూనికేషన్ వంటివే భవిష్యత్ నాయకత్వానికి పునాది. చద్దా గానీ మరెవరైనా గానీ ముఖ్యంగా సోషల్ మీడియాను ప్రధాన వేదికగా చేసుకుని రాజకీయాల్లో ఎదిగే వారి ముందు ఉన్న సవాలు కూడా ఇదే. డిజిటల్ దూరాన్ని తగ్గించి, వాస్తవ రాజకీయాల్లో తన స్థిరత్వాన్ని నిరూపించగలగడం. చద్ధా విషయంలో అదే జరిగితే ఈ అన్‌ఫాలోల తుఫాను తాత్కాలికమే అవుతుంది; లేకపోతే అది రాజకీయ ప్రయాణంలో దీర్ఘకాల ప్రభావం చూపే మలుపుగా మిగిలిపోతుంది.చెడ్డ రాజకీయాలు..! ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు..అయితే రాఘవ్ చద్ధా తన ఇన్‌స్టాలో అన్ ఫాలో అయిన వారి సంఖ్యను కొంత వరకైనా రికవర్ అయినట్లు చూపించుకుని తనకు ప్రజాధరణ తగ్గలేదని నిరూపించుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారు. ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేస్తున్నారని తాజాగా కొందరు అతని ఫేక్ లేదా కృత్రిమంగా తయారు చేస్తున్న ఫాలోవర్ల వివరాలను వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల ద్వారా నిరూపిస్తుండడం అతని ఇమేజ్‌ను మరింత డామేజ్ చేస్తోంది.

# బెంగాల్ లో మార్పు ఖాయమేనా

కోల్ కత్తా, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) వెస్ట్ బెంగాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఎక్కడ కూడా అధికార టిఎంసి నేతల్లో ఉత్సాహం కనిపించలేదు. కనీసం వారిలో గెలుస్తామని ఆశ కూడా కనిపించలేదు. దీనిని బట్టి అక్కడ బిజెపి హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఎంసీ నాయకులు ప్రతిసారి దూకుడు కొనసాగిస్తుంటారు.. ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తుంటారు. అవసరమైతే హింసకు కూడా వెనుకాడరు. ప్రాణాలను కూడా తీస్తారు. ఎందుకంటే అది మమత రాసిన రాజ్యాంగం.. మమత బెనర్జీ గత 15 సంవత్సరాలుగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో రూపొందించిన తన మార్క్ న్యాయం. అవినీతి అక్కడ నిత్య కృత్యం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులకు అది సురక్షితమైన షెల్టర్.. మమత బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి అద్భుతంగా అండదండలు లభించాయి. చివరికి ఆధార్ కార్డులు.. ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందాయి. దీంతో మమత పార్టీ కి దండిగా ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.కేంద్ర ఎన్నికల సంఘం అక్రమంగా నమోదైన ఓటర్లను ఏరి వేసే కార్యక్రమం చేపట్టింది.. దీంతో చాలామంది అక్రమార్కులు తమ ఓటు హక్కును కోల్పోయారు. ఇది ఒక రకంగా మమతకు గట్టి ఎదురు దెబ్బ. అయితే ఈసారి ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సందర్భంలోనూ మమతకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో తిరుగులేని స్ట్రాటజీని పాటించింది. ఫలితంగా మమత ఏమీ చేయలేని స్థితిలో కూరుకుపోయింది.మీరు ఆశీర్వదిస్తే ఇలాంటి సభలకు వస్తాను. లేనిపక్షంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటానని ఎన్నికల సభలో మమత వ్యాఖ్యానించిందంటే.. అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెస్ట్ బెంగాల్ లో బిజెపి నాయకత్వం ఈసారి ఏకతాటి మీద పని చేసింది. విభేదాలను పక్కనపెట్టింది. సీట్ల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తలు పాటించింది. అధికార టీఎంసీ నేతల ఆగడాలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంది. అందువల్లే బిజెపి ఈసారి అక్కడ అధికారంలోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తంగా 294 స్థానాలు ఉన్నాయి. మెజారిటీ సంస్థలు బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో అస్సాం, పుదుచ్చేరి ప్రాంతాలలో ఎన్డీఏ గెలుపు దాదాపుగా ఖాయం. ఇప్పుడు అదనంగా వెస్ట్ బెంగాల్ కూడా బిజెపి ఖాతాలో చేరుతోంది. ఈ ప్రకారం చూసుకుంటే భవిష్యత్ కాలంలో కేరళ, తమిళనాడులో కూడా బిజెపి జెండా ఎగురుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# మేడిపల్లి పీఎస్ పరిధిలో వరుస చోరీల నిందితుడు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు



మేడ్చల్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ఇళ్ల చోరీల కేసులను మేడిపల్లి పోలీసులు ఛేదించి, అలకుంట్ల ప్రశాంత్ (19) అనే పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.బోడుప్పల్, పీర్జాదిగూడ, కంచన్‌బాగ్, సింగారం ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పీర్జాదిగూడలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2026 ఫిబ్రవరి నెల నుంచి ఈ వరుస చోరీలకు సంబంధించి మేడిపల్లి పీఎస్‌లో మొత్తం 10 కేసులు నమోదు కాగా, అన్నింటిలోనూ ప్రశాంతే నిందితుడిగా గుర్తించారు.గతంలో 2023 సంవత్సరంలో మైనర్‌గా ఉండగానే పలు దొంగతనాల్లో పాల్గొని జువెనైల్ హోమ్‌కు వెళ్లి వచ్చినప్పటికీ, మార్పు లేక మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్, ఐఫోన్, సుమారు 40 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించగా, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# భావోగ్వేదనికి లోనైన సిపి సుదీర్ బాబు.

ఇబ్రహీంపట్నం రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో ఫ్యూచర్ సిటీలో గౌరవ వందనం స్వీకరించిన కమిషనర్ జి. సుధీర్ బాబు గురువారం ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో రిటైర్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అందరి సహకారం వల్లే ముందుకు కోన సాగడం జరిగింది. ఈ పెరేడ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దాదాపు 31 సంవత్సరాల కాలం వివిధ హోదలలో పని చేయడం జరిగిందని బావోగ్వేదనికి లోనైయారుర. పని చేయడం మన బాధ్యత ఫలితం అదే వస్తుంది. ప్రతి స్థాయి నుండి మనం చేసే పనిలో ఎత్తు పల్లాలు ఉంటాయి వాటిని అధిగమించి ముందుకు సాగాలి. పోలీస్ శాఖలో ఎవరికి రాని అవకాశాలు నాకు మాత్రమే దక్కాయి. వివిధ కమిషనరేట్ పరిధిలో నాలుగు సార్లు సిపిగా విధులు నిర్వహించడం జరిగింది . పూర్వ రాచకొండ ప్రస్తుత ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ను నెంబర్ వన్ స్థానాన్ని అందిపుచ్చుకున్నాం. క్రైమ్, సైబర్ నేరాలు ,ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ కల్పించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన పోలీస్ అధికారుల పాత్ర కీలకం అందరు సమిష్టి కృషితోనే ఫలితాలను సాధించాం అని సిపి సుదీర్ బాబు అన్నారు.

# అక్రమ మట్టి తవ్వకాల్లో ఘర్షణ

## కేతవీరునిపాడు గ్రామ నాయకులు వీఆర్వో పై దాడి

నందిగామ చందర్లపాడు మండలం ముప్పాల గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఎటువంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు కేతవీరునిపాడు గ్రామ నాయకులు చేస్తున్నారని గ్రామ ప్రజలు తహశీల్దార్ కి సమాచారం ఇచ్చారు. విచారణ నిమిత్తం వీఆర్వో బాబురావు, వీఆర్ఏ నారాయణ లను తహశీల్దార్. పంపించారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించి తవ్వకాలను అడ్డుకున్న వీఆర్వో, వీఆర్ఏలను నీకు చాతనైంది చేసుకోపో అని నాయకులు బెదిరించారు. గ్రామ నాయకులు, అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

# ఫెయిలవుతానని తనువు చాలించింది కానీ.. పాసయింది..

మెదక్ పదవ తరగతి స్ ఫలితాల్లో ఫెయిల్ అవుతానని భయంతో బాలిక ఆత్మహత్య చేసుకుంఇ. ఫలితాల్లో బాలికకు 1బబి క్లాస్ మార్కులు వచ్చాయి. మెదక్ జిల్లా పాద్చన్పల్లి గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో సాయి ప్రియ ఈ నెల 24వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. బుధవారం విడుదలైన ఫలితాల్లో బాలికకు 480 మార్కులు వచ్చాయి. దాంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయారు.

## వీఆర్ఓ పై టిడిపి నేత ,అతని కుటుంబం దాడి

కైకలూరుఅక్రమ లేఅవుట్ ను అడ్డుకున్న వీఆర్ఓ పై టిడిపి నేత ,అతని కుటుంబం దాడి కి దిగారు. మండవల్లి మండలం పులపర్రు గ్రామంలో ఘటన జరిగింది. పులపర్రు గ్రామంలోని మోటూరు కాలువ మార్జిన్ ను టిడిపి నేత ముంగర ఏడుకొండలు పూడ్చేసి అక్రమ లే అవుట్ వేస్తున్నారు. ఎమ్మార్వో ఆదేశాలతో అక్రమ లే అవుట్ ను అడ్డుకునేందుకు పులపర్రు వీఆర్వో వెంకటేష్ వెళ్లారు. వెంకటేష్ పై టిడిపి నేత ఏడుకొండలు , అతని అనుచరులు దాడి చేసారు. ఎప్పటికైనా నిన్ను చంపేస్తామని వీఆర్వోను బెదిరించారు. నా విధులను ఆటంకపరిచి నన్ను చంపుతామని బెదిరించిన వారి దగ్గర నుండి నాకు ప్రాణహాని ఉందని వీఆర్వో వెంకటేష్ పిర్యాదు చేసాడు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు.

## సికిద్రాబాద్ లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

సికింద్రాబాద్ జోన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమం అంబర్పేట్ ప్లే గ్రౌండ్లో ప్రారంభమయ్యాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు పాల్గొని జెండా ఊపి సమ్మర్ క్యాంపు ప్రారంభించారు . ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోచర్లకు జీతాలను పెంచాలని కోరారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు.

## జర్నలిస్టు హత్య కేసు నిందితులు లొంగుబాటు

చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం, వెంకటగిరి కోట (వి.కోట ) లో మంగళవారం ఉదయం వాకింగ్ చేస్తున్న ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి ని కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఉగ్రవాది షేక్ తమిమ్ మరియు సయ్యద్ సుభాన్ లు బెంగళూరు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారు. పోలీస్ అధికారులు ఎంకౌంటర్ చేస్తారన్న భయంతో లొంగిపోయినట్లు సమాచారం.

## పోయిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్ ఛాదర్ఘాట్ పోలీసులు (11) పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను విజయవంతంగా స్వాధీనం చేసుకుని, వాటిని అసలైన యజమానులకు అప్పగించారు. దొంగతనం, ఎక్కడో పెట్టేసి మర్చిపోవడం, లేదా ప్రమాదవశాత్తు పోగొట్టుకోవడం వంటి కారణాల వల్ల ఈ ఫోన్లు పోయాయని, బాధితులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (అఇఎఖీ) పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేశారని తెలిసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా, పోలీసులు చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆ పరికరాలను గుర్తించి, బాధితులకు తిరిగి అప్పగించారు. టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్, అప్పటి నుండి పనిచేస్తోందని మలక్పేట్ ఏసీపీ కె. సుబ్బారామి రెడ్డి, చాదర్ఘాట్ ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి కసాని తెలిపారు. తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న పౌరులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్, ఎన్సీఆర్పి పోర్టల్ ద్వారా లేదా 1930 హెల్ప్లైన్కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయాలని వారు సూచించారు. చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు.

# ఫుల్ మార్క్స్ సాధించిన 'ఎపిక్ ? ఫస్ట్ సెమిస్టర్' మూవీ టీజర్



'ఎపిక్ ? ఫస్ట్ సెమిస్టర్' ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమా నుంచి ఎలాంటి కంటెంట్ రాబోతుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. ఈ చిత్రం ఒక హృద్యమైన అనుభూతిని అందిస్తుందని వాగ్దానం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'సంచారమే' అద్భుతమైన స్పందనను సొంతం చేసుకోగా, తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను అమాంతం పెంచేసింది.
'ఎపిక్' టీజర్ అందమైన అనుభూతిని అందిస్తూ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల మధ్య కథను కేంద్రీకరిస్తుంది. 'బేబీ' సినిమా తర్వాత ఈ జంటకు ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ సరికొత్తగా మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది.
90'బ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ సినిమాతో వెండితెరపై అడుగుపెడుతున్నారు. తాజాగా విడుదలైన టీజర్, మొదటి సినిమాతోనే ఆయన ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోబోతున్నారనే నమ్మకాన్ని కలిగిస్తోంది.
హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని తొలి గీతం "సంచారమే" ఇప్పటికే అన్ని ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రెండ్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇక టీజర్ లోనూ తనదైన నేపథ్య సంగీతంతో మెప్పించారు హేషమ్ అబ్దుల్ వహాబ్.
లండన్ నేపథ్యంతో సాగే ఈ చిత్రం ఒక అందమైన, ఆసక్తికరమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ఆధునిక సంబంధాలు, ప్రేమలో మారుతున్న భావోద్వేగాలను ఈ సినిమా చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రేమకథలో ఆనంద్ దేవరకొండ ఇంట్రోవర్ట్ (అంతర్ముఖుడు) పాత్రలో కనిపిస్తుండగా, వైష్ణవి చైతన్య పూర్తి విరుద్ధంగా ఎక్స్‌ట్రోవర్ట్ (బహిర్ముఖురాలు) పాత్రలో ఆకట్టుకోనున్నారు. విభిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా పుట్టింది? వారి ప్రయాణం ఎలా సాగింది? అనేది టీజర్‌లో ఎంతో హృద్యంగా చూపించారు.
హైదరాబాద్ లోని ఏఎంబి సినిమాస్ లో జరిగిన 'ఎపిక్' టీజర్ ఆవిష్కరణ వేడుకలో కథానాయకుడు ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "ఎపిక్ టీజర్ మీ అందరికీ నచ్చింది అనుకుంటున్నాను. ఎపిక్ సినిమా చేయడం చాలా చాలా సంతోషంగా ఉంది. ఆదిత్య హాసన్ వచ్చి ఈ కథ చెప్పినప్పుడు.. నా కథ నాకే చెప్పాడా అనిపించింది. ఎందుకంటే నేనూ విదేశాల్లో చదువుతున్నాను. ఇందులోని చాలా సన్నివేశాలు నాకు కనెక్ట్ అయ్యాయి. విదేశాలకు వెళ్ళి చదువుకున్న వాళ్ళకు మాత్రమే కాదు.. ఈ కథలోని భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతాయి. కుటుంబం, ప్రేమ, బంధం, భావోద్వేగాలు ఇలా ప్రతిదీ మీ మనసుకు నచ్చుతాయి. దర్శకుడు ఆదిత్య హాసన్ లో ఎంతో ప్రతిభ ఉంది. భవిష్యత్తులో ఆదిత్యను స్ఫూర్తిగా తీసుకొని ఎందరో కొత్త దర్శకులు వస్తారు. వైష్ణవి చైతన్య లాంటి ప్రతిభగల నటితో నటించడం సంతోషంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ లాంటి సంస్థలో సినిమా చేయడం ఆనందంగా ఉంది. సార్, లక్కీ భాస్కర్, టిల్లు, మ్యాడ్, జెర్సీ లాంటి సినిమాల సరసన ఎపిక్ చేరుతుందనే నమ్మకం ఉంది. మన చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరికీ ఇది మన కథే కదా అనిపిస్తుంది. ఇందులో హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ప్రతి పాట అద్భుతంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం మనసు పెట్టి పనిచేశారు." అన్నారు.
కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ.. "ముందుగా 'సంచారమే' పాటపై ప్రేమను కురిపించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఎపిక్ కథ నాకు చాలా నచ్చింది. కథ వినగానే నేను ఈ సినిమాలో భాగం కావాలి అనుకున్నాను. నేను పోషించిన కదలి పాత్ర చాలా బాగుంటుంది. కథ వినేటప్పుడు ఆ కదలి నాలో ఉందేమో అనిపించింది. చాలామంది అమ్మాయిల్లో ఆ కదలి ఉంటుంది అనిపించింది. ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర కూడా బాగుంటుంది. ఈ సినిమాలోని ప్రతి పాత్రను చాలా బాగా డిజైన్ చేశారు. ఎపిక్ నా మనసుకి దగ్గరైన సినిమా. ఇదొక అందమైన ప్రేమ కథ. మనల్ని మనం చూసుకుంటున్నట్టు అనిపిస్తుంది. సినిమా చూస్తుంటే మన స్నేహితులు గుర్తుకొస్తారు. మీ కుటుంబంతో కలిసి ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి." అన్నారు.
దర్శకుడు ఆదిత్య హాసన్ మాట్లాడుతూ.. "ఈ సినిమా ప్రతి ఒక్కరికీ చేరువయ్యే ప్రేమకథ. కథ రాస్తున్నప్పుడు, తీస్తున్నప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల మనసు గెలుచుకుంటుందని నమ్మాను. చిత్ర విజయం పట్ల ఎంతో నమ్మకంగా ఉన్నాము. బంధాలను, భావోద్వేగాలను గొప్పగా చూపించడానికి మా శాయశక్తులా కృషి చేశాము. ఇది కుటుంబంతో కలిసి చూడదగ్గ చిత్రం. 90'బ వెబ్ సిరీస్ తీసినట్టుగానే ఈ సినిమాను కూడా సహజంగా తెరకెక్కించాము. మీ తల్లిదండ్రులతో కలిసి ఈ సినిమాను చూసి ఆనందిస్తారని కోరుకుంటున్నాను." అన్నారు.
సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. అత్యుత్తమ సాంకేతిక బృందం ఈ చిత్రానికి పనిచేస్తోంది. అజీమ్ మహమ్మద్ ఛాయాగ్రాహకుడిగా పని చేస్తున్న ఈ చిత్రానికి కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే "సంచారమే" గీతం మ్యూజికల్ హిట్‌గా నిలవగా, తాజాగా విడుదలైన టీజర్ అందరినీ కట్టిపడేస్తోంది. 'ఎపిక్ ? ఫస్ట్ సెమిస్టర్' చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించడానికి భారీ విడుదలకు సిద్ధమవుతోంది. త్వరలో సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అప్‌డేట్స్ రానున్నాయి.

# ఘనంగా "డాక్టర్ కీర్తి" ఎంబీబీఎస్ ఎంఎస్ సినిమా టీజర్ లాంఛ్




గోపాలకృష్ణ దొండపాటి సమర్పణలో స్వర్ణ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళ స్టార్ హీరోయిన్ భావన ప్రధాన పాత్రలో నటించిన మలయాళ చిత్రం హంట్ తెలుగులో "డాక్టర్ కీర్తి", ఎంబీబీఎస్ ఎంఎస్ అనే పేరుతో అనువాదమవుతోంది. మలయాళ దర్శకుడు షాజీ కైలాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ సంచలనం సృష్టించిన కలకత్తాలోని జరిగిన డాక్టర్ రేప్ మర్డర్ నేపద్యం గా తెరకెక్కించారు. మలయాళంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని స్వర్ణ క్రియేషన్స్ రెండు తెలుగు రాష్ట్రాల్లో పీవీఆర్ సినిమాస్ తో భారీ ఎత్తున మే 8న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు నిర్మాతలు స్వర్ణకుమారి దొండపాటి, ఎం విశ్వనాథ్ రెడ్డి. ఈ రోజు ఈ చిత్ర టీజర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో
చిత్ర నిర్మాతలు స్వర్ణకుమారి దొండపాటి, ఎం.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ – కోల్ కత్తా లో సంచలనం సృష్టించిన డాక్టర్ రేపు మర్డర్ కేసు ఆధారంగా మలయాళ ప్రముఖ దర్శకుడు షాజీ కైలాస్ అద్భుతంగా తెరకెక్కించిన సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాము. అప్పుడు జరిగిన ఆ సంఘటన పట్ల ప్రపంచం అంతా నివ్వెరపోయింది. డాక్టర్ పాత్రలో నటి భావన నటించారు ఆమె ఫెర్ఫార్మెన్స్ అద్భుతంగా వుంటుంది. ఈ చిత్రంలోని ఎమోషన్ ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. ఇక కైలాష్ మీనన్ సంగీతం సినిమాకి హైలెట్ గా వుంటుంది. పీవీఆర్ ద్వారా మే 8న మా చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నాం. మలయాళంలో సంచలన విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులో కూడా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అన్నారు నటి కవిత మాట్లాడుతూ – మలయాళంలో సూపర్ డూపర్ హిట్ అయిన ఈ సినిమాను తెలుగులోకి గోపాలకృష్ణ గారు ఆయన టీమ్ తీసుకొస్తోంది. యదార్థ ఘటనల ఆధారంగా దర్శకుడు షాజీ కైలాస్ ఈ సినిమాను ఆసక్తికరంగా తెరకెక్కించారు. మహిళలకు రక్షణ లేని ఈ సమాజంలో వెస్ట్ బెంగాల్ లో ఒక డ్యూటీ డాక్టర్ కు ఎదుర్కొన్న విషాదకర ఘటన మనందరినీ కలిచివేసింది. ఆ వైద్యురాలి ఆత్మ తన బాధను చెబితే ఎలా ఉంటుంది అనేది ఈ మూవీలో దర్శకుడు తెరకెక్కించారు. షాజీ కైలాస్ గారు ఎంతో ప్రతిభ గల దర్శకులు. ఈ సినిమా చూస్తుంటే టెక్నికల్ గా ప్రతి ఎలిమెంట్ బాగుంది. ఇలాంటి మూవీస్ ను పెద్ద ప్రొడ్యూసర్స్ పోటీపడి దక్కించుకుంటారు. ఈ పోటీలో గోపాలకృష్ణ గారు ఈ సినిమా దక్కించుకోవడం సంతోషకరం. గోపాలకృష్ణ గారికి, ఆయన శ్రీమతి స్వర్ణకుమారి గారికి మిగతా టీమ్ అందరికీ ఈ సినిమా మంచి విజయం అందించాలని కోరుకుంటున్నా. అన్నారు.ప్రొడ్యూసర్ లయన్ సాయివెంకట్ మాట్లాడుతూ – గోపాలకృష్ణ గారు "డా.కీర్తి", ఎంబీబీఎస్ ఎంఎస్ అనే ఒక మంచి మూవీని మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా చూశాను. నేను ఆ మూవీ చూస్తూ కథలో లీనమైపోయాను. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది. ఇది రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా తెరకెక్కించిన మూవీ. ఈ మూవీ చూడగానే పీవీఆర్ వాళ్లు రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చారంటే ఎంత బాగుందో అర్థం చేసుకోవచ్చు. హీరోయిన్ భావన తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచితమే. ఈ సినిమా గోపాలకృష్ణ గారికి సూపర్ హిట్ ఇస్తుందని ఆశిస్తున్నాను. అన్నారు.లీగల్ అడ్వొకేట్ ప్రభాకర్ మాట్లాడుతూ – "డా.కీర్తి", ఎంబీబీఎస్ ఎంఎస్ సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ సినిమా గోపాలకృష్ణ గారికి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా. ఈ సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. అన్నారు.
నటీనటులు – భావన, రెంజి పనికర్, చందునాథ్, డెయిన్ డేవిస్, అను మోహన్, అజ్మల్ అమీర్, అదితి రవి, తదితరులు

## పదో తరగతి ఫలితాల్లోనూ ఎదురులేని ఎంజేపీ బీసీ గురుకులాలు

అమరావతి టెన్త్ ఫలితాల్లో 96.02 శాతం సాధించి ఎంజేపీ గురుకులాలు స్టేట్ సెకండ్ ప్లేస్ లో నిలిచాయి. 596, 593 మార్కులు నరవాడ ఎంజేపీ స్కూల్ విద్యార్థులు సాధించారు. 100 స్కూళ్లకు గానూ 30 స్కూళ్లలో వంద శాతం ఫలితాలు సాధించారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ప్రభుత్వ పరిధిలో ఉండే గురుకులాల్లో ఎంజేపీదే టాప్ ప్లేస్. ఎంజేపీ గురుకులాలు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై మంత్రి సవిత హర్షం ప్రకటించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. బీసీ బిడ్డల విద్యోన్నతికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమే ఈ అత్యుత్తమ ఫలితాలు. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు బీసీ బిడ్డలు, వారి తల్లిదండ్రుల తరఫున ధన్యవాదాలని మంత్రి సవిత అన్నారు.

## టీఆర్ఎస్ పార్టీకి సీఈసీ ఆమోదముద్ర


హైదరాబాద్ టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. టీఆర్ఎస్ పేరును అధికారికంగా కల్వకుంట్ల కవిత కు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర సేన కు అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈనెల 25న మేడ్చల్ లోని అద్వయ కన్వేషన్ లో టీఆర్ఎస్ పార్టీ పేరు కల్వకుంట్ల కవిత ప్రకటించిన విషయం తెలిసిందే.బంజారాహిల్స్ లోని కవిత నివాసంలో పార్టీకి అనుమతి ఇస్తూ అధికారులు లేఖ అందజేసారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నేతలను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ .ఎస్ .ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ రాష్ట్రంలో రైతుల పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కేసీఆర్ సీఎంగా ఉంటే ఢిల్లీ మెడలు వంచే వారు. సీఎం రేవంత్ రెడ్డి టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నాయకులను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో పోలీసు అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా విచారణ చేయాలి. కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు ను ఇరికించాలని రెండవ సిట్ వేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది చట్టబద్ధంగా దేశ భద్రత కోసం జరుగుతుంది. ఏ ప్రభుత్వం ఉన్నా ట్యాపింగ్ జరుగుతుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నేతలను ఇరికించే ప్రయత్నం జరుగుతుంది. 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదు. ప్రభాకర్ రావును 18 రోజులు జైల్లో కరుడుగట్టిన నేరస్తుడిలా ట్రీట్ చేశారని అన్నారు.
ఫోన్ ట్యాపింగ్ ఛార్జ్ షీట్ లో కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. సంధ్య శ్రీధర్ రావుపై 26 కేసులు ఉన్నాయి.అతనితో ఎమ్మెల్సీ నవీన్ రావు పేరు చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సీనియర్ జర్నలిస్టును ఇరికించి అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటీషన్ వేస్తే హరీష్ రావు పేరు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారు. కేసీఆర్ ఇంటి గోడలపై నోటీసులు అంటించి ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది రహస్యంగా ఉంటుంది. భాద్యత లేని హోంమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పోలీసు డిపార్ట్మెంట్ బలైంది. రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు తప్పులు చేస్తున్నారు. నంబీ నారాయణన్ అనే ఇస్రో సైంటిస్ట్ పై అక్రమ కేసు మోపినందుకు విచారణ చేసిన వాళ్ళను కోర్టు దోషులుగా ప్రకటించింది. క్రిశాంక్ పై కేసు పెట్టి జైలుకు పంపారు. కేటీఆర్,హరీష్ రావు ఇళ్ల ముందు ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారు. బెంగుళూరు నుంచి ప్రయివేటు హ్యాకర్లను తీసుకువచ్చి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు. దీనిపై సిట్ వేసి విచారణ జరపాలి. రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీలో ఎంత మంది బీసీ,ఎస్సి,ఎస్టీలు డైరెక్టర్లుగా ఉన్నారు. ఐపీఎస్ అధికారులు సీఎం ఆదేశాలను పాటించవద్దు. కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాము. గతంలో నాకు యాపిల్ ఫోన్ నుంచి వచ్చిన మెసేజ్ ను సెంట్రల్ క్రైం పోలీసులకు ఇచ్చానని అన్నారు.

## ఏసీబీ వలలో ఫారెస్ట్ బీట్ అధికారి

### రూ పది వేలు తీసుకుంటు ఉండగా పట్టుకున్న ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్.



గుండాల పోడు రైతు నుండి రూ పది వేలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో గురువారం దాడి చేసి ఓ ఫారెస్టు బీట్ అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రైతు నుండి పది వేలు లంచం తీసుకుంటు గుండాల మండలం, నడిమిగూడెం ఫారెస్టు బీట్ అధికారి బానోతు నరేష్ ఏసీబీ కి పట్టుబడ్డారు. మారు మూల గ్రామాల నుండి ఏసీబీ కి ఫిర్యాదులు అందే స్థాయిలో ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్.ప్రజలను చైతన్య వంతులను చేశారు. ఫిర్యాదు రాగానే స్పందించడం తో ప్రజల్లో అవేర్నెస్ బాగా పెరిగింది. గుండాల మండలం సాయనపల్లి లో పోడు రైతును ఇబ్బంది పెట్టాసుకుండా ఉండేందుకు ఈ లంచం తీసుకుంటు బీట్ అధికారి ఏసీబీ కి చిక్కారు.

## పెళ్లి వేడుకలో డాన్స్ చేస్తూ నవవధువు మృతి!

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లా బాగోడాలో జరిగిన పెళ్లి వేడుకలో ఘోర విషాదం చోటుచేసుకుంది. 22 ఏళ్ల నవవధువు దీపిక డాన్స్ చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందింది. నాలుగు నెలల క్రితమే వివాహమైన ఆమె, గుండెపోటు కారణంగానే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సరదాగా సాగుతున్న వేడుకలో ఆమె అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ హృదయవిదారక ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పోలవరం డిఎస్పి ఉద్యోగ విరమణ

పోలవరం డిఎస్పి గా విధులు నిర్వహిస్తున్న ఎం వెంకటేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిఎస్పి వెంకటేశ్వరరావుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ఏఆర్ అదనపు ఎస్పీ మునిరాజా డిఎస్పీలు శ్రావణ్ కుమార్ యు రవిచంద్ర, సిఐలు ఎస్సైలు ఆయనను ఘనంగా సత్కరించారు. డి.ఎస్.పి తన విశ్రాంత జీవితం కుటుంబంతో ఆనందంగా గడపాలని ఎస్పీ కోరారు

# సెలెక్షన్ లిస్టు విడుదల చేయాలని ధర్నా

హైదరాబాద్ వైద్య ఆరోగ్య శాఖ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేస్తుందని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. కానీ కొంతమంది అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. హైదరాబాద్ కోఠి లోని డిఎంఈ కార్యాలయం ముందు సెలక్షన్ లిస్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫార్మసీస్ట్ అభ్యర్థులు చేపట్టిన ఆందోళనకు కృష్ణయ్య మద్దతు తెలిపారు. పోలీసులు కార్యాలయంలోకి అభ్యర్థులను అనుమతించకపోవడంతో , కృష్ణయ్య పోలీసులతో వాగ్వివాదానికి దిగి , అభ్యర్థులను లోపలికి తీసుకెళ్లారు. అనంతరం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ సభ్యుడు గోపికాంత్ రెడ్డిను కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... 732 ఫార్మసీస్ట్ పోస్టులకు 24 వేల మంది అభ్యర్థులు పోటీ పడ్డారని , కానీ గత నాలుగు నెలలుగా సెలక్షన్ లిస్ట్ రాకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. కోర్టు కేసుల నెపంతో సెలెక్ట్ లిస్ట్ విడుదలను జాప్యం చేస్తున్నారన్నారు. అధికారులకు 15 రోజుల సమయం ఇస్తున్నామని , అప్పటివరకు లిస్ట్ విడుదల చేయకపోయే వేలాది మంది నిరుద్యోగులతో డిఎంఈ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

# సిఐపై అత్యాచార ఆరోపణలు దర్యాప్తు ముమ్మరం

గుంటూరు వినుకొండలో సీఐపై అత్యాచార ఆరోపణలు సంచలనంగా మారాయి. గతంలో స్థానికంగా విధులు నిర్వహించిన సీఐ చిన్న మల్లయ్య తనపై బలవంతంగా అత్యాచారం చేశారంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం క్రైమ్, రెవెన్యూ అధికారులు వీరితోపాటుగా స్థానిక పోలీసులు బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో ఆధారాలు సేకరిస్తూ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. పోలీసు అధికారిపైనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడంతో కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# సురేష్ నాయక్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

హైదరాబాద్ ఉస్మానియా పీజీ విద్యార్థి డాక్టర్ కట్రావత్ సురేష్ నాయక్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు హైదరాబాద్ హైదర్గూడలోని ఎన్ఎస్ఎస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మాట్లాడారు.

ఈ సమావేశంలో మృతుడు సురేష్ నాయక్ తల్లి నాగమణి, బావ రవి కూడా పాల్గొన్నారు. సురేష్ నాయక్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగంలో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని వారు తెలిపారు. ఇటీవల ఉస్మానియా మెడికల్ కాలేజీని సందర్శించి ఘటనపై నిజ నిర్ధారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న సురేష్ నాయక్ సీనియర్ల వేధింపుల కారణంగా మానసిక ఒత్తిడికి గురై ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. విద్యార్థులకు అనుకూలంగా లేని ఎన్ఎంసీ నిబంధనలను సవరించాలని, అలాగే మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# వైద్య సేవల్లో నైతికత కీలకం? ఎఐఎంఎస్ఆర్ వర్క్‌షాప్‌లో నిపుణుల అభిప్రాయం




చిత్తూరు, ఏప్రిల్ 30: మురకంబట్టులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్)లో పీజీ విద్యార్థులు, అధ్యాపకుల కోసం వైద్య నైతికత మరియు గుడ్ క్లినికల్ ప్రాక్టీస్ (జీసీపీ) మార్గదర్శకాలపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎఐఎంఎస్ఆర్, చెన్నై అపోలో మెడికల్ కాలేజీకి చెందిన పీజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ఆల్ఫ్రెడ్ జె. అగస్టీన్ మాట్లాడుతూ, వైద్య రంగంలో నైతిక విలువలు కీలకమని తెలిపారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు మెరుగైన అభ్యాస అనుభవాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.ప్రారంభ ఉపన్యాసంలో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి మాట్లాడుతూ, పేషెంట్ కేర్, క్లినికల్ బాధ్యత వైద్యుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. రోగులను గౌరవంగా చూసుకోవడం, వారి మాట వినడం అవసరమన్నారు. వైద్యం పొందడం ప్రతి రోగి హక్కు అని, ఎట్టి పరిస్థితుల్లోనూ సేవలను నిరాకరించకూడదని పేర్కొన్నారు. నిజాయితీ, నైతికత క్లినికల్ ప్రాక్టీస్‌లో ముఖ్యమని తెలిపారు.ఈ సందర్భంగా కీ రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్న డాక్టర్ అశోక్ షెనోయ్ (సీనియర్ ఫ్యాకల్టీ, క్లినికల్ రీసెర్చ్, జీసీపీ ట్రైనర్), డాక్టర్ అనిమేష్ జైన్ (ఫ్యాకల్టీ, మెడికల్ ఎథిక్స్, క్లినికల్ రీసెర్చ్)లు వైద్య నైతిక నియమాలు, గుడ్ క్లినికల్ ప్రాక్టీస్, క్లినికల్ ట్రయల్స్ నిబంధనలు, క్లినికల్ పరిశోధన మార్గదర్శకాలు, ఇన్ఫార్మ్డ్ కన్సెంట్, రోగుల గోప్యత వంటి అంశాలపై సవివరంగా వివరించి, పాల్గొన్నవారికి సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ రమ్యా రామకృష్ణన్, అసోసియేట్ డీన్ (రిసెర్చ్) డాక్టర్ ఉషా అడిగ, విభాగాధిపతి డాక్టర్ సచ్చితానంద అడిగ, స్టూడెంట్స్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ దీప్తి, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉస్మానియా జనరల్ హాస్పిటల్లో అరుదైన లివర్ ట్రాన్స్ప్లాంటేషన్

హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్లో డాక్టర్ఉ అరుదైన లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ ను విజయవంతంగా చేసారు. గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్తో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి... విజయవంతంగా లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ చేసారు. 0 కిలోల బరువున్న బాలుడికి విజయవంతంగా లివర్ మార్పిడి చేసారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి... చిన్నారికి ఉస్మానియా వైద్యుల బృందం అమర్చింది. 4 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది.

ఆరోగ్యశ్రీ పథకం కింద డాక్టర్లు పూర్తిగా ఉచితంగా చికిత్స అందించారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదు అని డాక్టర్లు తెలిపారు. ఉస్మానియా డాక్టర్ల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# ఎస్ఎస్సి ఫలితాల్లో 92.97 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.



రుద్రవరం. 10 వ తరగతి పరీక్షఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 92.97 శాతం ఉత్తీర్ణత తో సత్తా చాటుకున్నారు.రుద్రవరం మండలంలో ఉన్న 10 పాఠశాలల నుండి మొత్తం 427 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా వారిలో 397 మంది ఉత్తీర్ణత సాధించి 92.97 శాతం ఫలితాలను నమోదు చేశారు. ఇందులో బాలురు 208 మంది, బాలికలు 189 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎల్లవతుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. నాగబాలాజీ 582 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, కస్తూరిబా గురుకుల పాఠశాల విద్యార్థిని ఎన్. భార్గవి 580 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, ఎల్లా వత్తుల ఉన్నత పాఠశాల విద్యార్థి కే పవిత్ర 575 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన బి. గౌరి మరియు జడ్పీహెచ్ఎస్ రుద్రవరంకు చెందిన కె. జాస్మిన్ 572 మార్కులతో 4 వ స్థానంలో నిలిచారు. నర్సాపురంలోని సెయింట్ థామస్ మార్తోమా పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఏపీ మోడల్ స్కూల్ (98.89%), ఆలమూరు జడ్పీహెచ్ఎస్ (95.31%), నర్సాపురం జడ్పీహెచ్ఎస్ (94.74%) పాఠశాలలు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా రాణించడంపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు

# 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన జొన్నగిరి ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు

## 88% ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

## బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రమేష్.



తుగ్గలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రోజున విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మండల పరిధిలోని గల జొన్నగిరి ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు జొన్నగిరి వసతి గృహ సంక్షేమ అధికారి రమేష్ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నగిరి ప్రభుత్వ వసతి గృహం నందు చదువుకుంటూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో 88% ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు.ప్రభుత్వ(ఎస్ డబ్ల్యు) బాలుర వసతి గృహం జొన్నగిరి నందు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు 25 మంది విద్యార్థులు రాయగ,అందులో 22 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులలో మొదటి స్థానం జానీ 487/600, రెండవ స్థానంలో రాహుల్ చంద్ర నాయక్ 448/600, మూడవ స్థానంలో సాగర్ నాయక్ 447/600 నిలిచారని ఆయన తెలియజేశారు.వీరిలో ఫస్ట్ డివిజన్ లో 19 మంది విద్యార్థులు,సెకండ్ డివిజన్ లో 3 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు.విద్యార్థుల ఫలితాల పట్ల వసతి గృహ సంక్షేమ అధికారి రమేష్,ట్యూటర్ సుధాకర్, నాగేష్,మధు కమాటి మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.


# .ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సు



సిద్దిపేట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళా భద్రత మరియు గృహ హింస నివారణపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుషాల్కర్ మరియు అడిషనల్ డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. సదస్సులో ముఖ్యాంశాలు:సదస్సును ఉద్దేశించి అడిషనల్ డీసీపీ కుషాల్కర్ మాట్లాడుతూ. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళల రక్షణ కోసం ఉన్న వివిధ చట్టాల గురించి, ముఖ్యంగా గృహ హింస నిరోధక చట్టం మరియు వేధింపులకు వ్యతిరేకంగా ఉన్న సెక్షన్ల గురించి అవగాహన కల్పించారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 'షీ టీమ్స్' సేవలు మరియు డయల్ 100 వినియోగంపై సూచనలు చేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన బాల్య వివాహాలు, సైబర్ వేధింపులు మరియు వరకట్న వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, మహిళలకు గౌరవం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకోవాలి. భయం వీడి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. మహిళల భద్రతకు సిద్దిపేట పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ తెలియజేశారు.అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయడం జరిగినదని. ఈ సదస్సులో స్థానిక పోలీసు అధికారులు ఏసిపి రవీందర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టు టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ , ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎబి. దుర్గా, న్యాయవాది రోహిణి, డిప్యూటీ డిఆర్డిఓ సుదీర్ బాబు, స్నేహిత ఎన్జీవో ఆర్గనైజేషన్ వసంత మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించిన నోవి పాఠశాల విద్యార్థులు

## విద్యార్థులను అభినందించిన పాఠశాల హెడ్మాస్టర్ తిప్పయ్య.




తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో నోవి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని నోవి పాఠశాల హెడ్మాస్టర్ తిప్పయ్య తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోవి పాఠశాల నుండి 12 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు.526 మార్కులతో కాశిరెడ్డి,509 మార్కులతో అజయ్,479 మార్కులతో జోష్న,472 మార్కులతో మధుసూదన్ లు పాఠశాల తరఫున మొదటి నాలుగు స్థానాలలో నిలిచారని ఆయన తెలియజేశారు.పదవ తరగతి ఫలితాలలో చక్కటి ప్రతిభను కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ తిప్పయ్య,పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# కొలిమిగుండ్లలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం...

కొలిమిగుండ్ల ఏప్రిల్ 30 కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని కొండపై వెలిసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నాడు బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఇటిక్యాల గ్రామానికి చెందిన బాలిరెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి పునర్మించిన తర్వాత మొదటిసారిగా బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నాగేశ్వరరెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శేఖర్, ఇటిక్యాల నారాయణరెడ్డి, ఇంకా ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోహెడ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం:

## ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్




కోహెడ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆఫ్ లైన్ నుండి ఆన్ లైన్ కి ఉండడం వల్ల రైతులకు ఇబ్బందులు రావడం వల్ల మళ్ళీ ఆఫ్ లైన్ లో కొనుగోలు కేంద్రాలు జరుగుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ రైతులకు మనం అండగా ఉన్నామని తెలియడానికి ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నాం.గ్రామాల్లో తాగునీరు సరఫరా లో ఇబ్బందులు రాకుండా చూసే బాధ్యత మనది అధికారులతో సమన్వయం చేయడానికి ఈ అంశం మీద ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం.ప్రభుత్వం పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో మంచి అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి మనమంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాం.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి బడి బాట కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ల సంఖ్య పెంచేలా ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటెల చర్యలు తీసుకోవాలికోహెడ మండలంలో ప్రతి గ్రామంలో ఆర్వీఎం మెడికల్ కాలేజీ ద్వారా హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నాం అందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి.గ్రామాల్లో ప్రతి బూత్ లో బిఎల్ఏ నియమించాలి ఓట్ల సవరణ సర్ ద్వారా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారు.తొలగించే ఓట్లు జాగ్రత్తగా పరిశీలించారు దొంగ ఓట్లు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకోవాలి.ఈ సమావేశంలో గ్రామాలు వేరు వేరుగా కూర్చొని సమావేశం ఏర్పాటు చేసుకొని గ్రామాల సమస్యలు,పెండింగ్ పనులు అంశాలు చెప్పడంతో పాటు ఐదు అంశాలపై ఐదుగురు సభ్యులతో కమిటీ ఇవ్వాలి.గ్రామాల్లో,మండలాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలిప్రజా పాలన ప్రభుత్వం లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకోవాలి.

ఈ సమావేశంలో పీసీసీ జనరల్ సెక్రటరీ సౌజన్య,మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, కోహెడ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు,ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల భద్రత సైబర్ , లింగ సమానత్వం,నేరాలపై అప్రమత్తత అవసరం

## డిసిఆర్బీ డీఎస్పీబాలాజీ నాయక్.

వనపర్తి. భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం, సైబర్ క్రైం,సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన× సైబర్




నేరాలు, లింగ వివక్ష, వేధింపుల నివారణపై సూచనలు×

భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన

సమాజంలో సురక్షిత వాతావరణం నెలకొనాలంటే ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని కార్యాలయాల్లో లింగ సమానత్వం, మహిళల గౌరవం ప్రతి సంస్థ బాధ్యతగా భావించాలని వనపర్తి డీసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్ అన్నారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా బుధవారం 3వ రోజు కార్యక్రమం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం సంయుక్తంగా ఉద్యోగులు, సిబ్బంది మరియు సంస్థల ప్రతినిధులకు లింగ సమానత్వం, సైబర్ నేరాలు, వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరం. తెలియని లింకులు, కాల్స్, మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కార్యాలయాల్లో మహిళలపై ఎటువంటి వేధింపులు జరిగినా వెంటనే ఫిర్యాదు చేయాలని, లింగ సమానత్వం ప్రతి సంస్థలో అమలు కావాలని కోరుతున్నాము. సురక్షితమైన పని వాతావరణం ఏర్పడితేనే సంస్థలు అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్,మల్లికార్జున్, ఏ హెచ్ టి యు ఎస్సై,అంజద్, సైబర్ క్రైమ్ ఎస్సై,రవి ప్రకాష్, భరోసా కోఆర్డినేటర్, శిరీష, షీ టీం సిబ్బంది, శ్రీనివాసులు, శ్రీశైలం, యాజిరెడ్డి,సైబర్ క్రైం, సిబ్బంది, విజయ్, లోకేష్, పవన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తా చాటిన వనపర్తి విద్యాసంస్థలు



వనపర్తి విద్యార్థులను అభినందించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పదో తరగతి ఫలితాలలో వనపర్తి పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. అనుస్ అకాడమీలో చదువుతున్న టిఆర్ఎస్వి నాయకులు భాగ్యరాజ్ కుమార్తె అక్షర 547/600 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచింది. వనపర్తి టౌన్ ఫస్ట్‌గా, జిల్లా సెకండ్‌గా డా. సీ.వి. రామన్ టాలెంట్ స్కూల్ విద్యార్థిని ఎ. సంజన 582/600 మార్కులతో అద్భుత ఫలితం సాధించింది. సీ.వి. రామన్ టాలెంట్ స్కూల్ చెందిన మరో విద్యార్థిని మదిహ 564/600 మార్కులు సాధించి ప్రతిభను చాటింది. ఈ సందర్భంగామాజీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, నరసింహ,కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, సుబ్బు నందిమల్ల, సయ్యద్ జమీల్, అలీమ్, వంశీ, కుమార్, సంతోష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం?




కరీంనగర్ ?కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఏడుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారంనాడు కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమిషనరేటు కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ నుండి ఎస్సై ఏ. సత్యనారాయణ, సిఎస్బి నుండి ఎస్సై డి. శ్రీనివాస్,ఏ ఆర్ విభాగం నుండి సర్ధార్ భగవాన్ సింగ్, మానకొండూరు పోలీసు స్టేషన్ నుండి ఏఎస్సై ఖాజా జమాలుద్దీన్, ఏఆర్ విభాగం నుండి ఏఆర్ ఎస్సై పి. లక్షయ్య, కొత్తపల్లి పోలీసు స్టేషన్ నుండి ఏఎస్సై హెచ్ వెంకటరమణ, ఏఆర్ అట్టాచ్డ్ హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి లు పదవీ విరమణ పొందారు.?కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ. అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఏడుగురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ సంక్షేమం కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఆర్ ఎస్సై తిరుపతి మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నాంపల్లి గుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహణ



వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిదే వైశాఖ శుద్ధ చతుర్దశి గురువారం సందర్భంగా విశేష కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అభిషేకం, బలిహరణం నిర్వహించగా,శ్రీ భూనీలా సమేత లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నివేదన, తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.పూర్ణాహుతి, బలిహరణం, మంగళాశాసనం, తీర్థప్రసాద కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో కన్యాదాతలుగా



రాచకొండ రామాచార్యులు,సంధ్య పాల్గొనగా, కళ్యాణోత్సవ దాతలుగా కరీంనగర్‌కు చెందిన కోటోజు శ్రీనివాస్, సుష్మ పాల్గొన్నారుఆలయ అర్చకులు,వేద పండితులు అంగరంగ వైభవంగా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీడ కొరకు టెంట్లు, కూలర్లు, చలువ పందిళ్లు త్రాగునీరు ఏర్పాటు చేశారు. స్వామివారి కళ్యాణ మండపాన్ని రంగురంగుల పూలతో అలంకరించి, గ్రీన్ మ్యాట్స్, అరటి తోరణాలు, మామిడి ఆకులతో సుందరంగా తీర్చిదిద్దారు.ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాదిగ సంక్షేమ పరిషత్ (ఎం ఎస్ పి) ఆత్మీయ సమ్మేళనం.

## హాజరైన ఎం ఎస్ పి కార్యకర్తలు




సి. బెలగల్ ఏప్రిల్ 30 మండల కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ పార్కు నందు మాదిగ సంక్షేమ పరిషత్ (ఎం.ఎస్.పి) ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎం ఎస్ పి కోడుమూరు నియోజకవర్గ అధ్యక్షులు జీవరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి జాతీయ అధ్యక్షులు ధరూర్ నరేష్ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు గూర్చి ఎం ఎస్ పి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడాలని ఇచ్చిన హామీలను రాజకీయ పార్టీలకు అతీతంగా అమలు చేయాలని తెలిపారు. దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గూర్చి మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. తప్పెట కళాకారులకు రాష్ట్రస్థాయిలో ఐడి కార్డులు, యూనిఫాంలు మంజూరు చేసి వయస్సు తో సంబంధం లేకుండా డప్పే ఆధారంగా జీవనం సాగిస్తున్న వారికి నెలకు 15వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలి. వితంతువులకు ఒంటరి మహిళలు చర్మ కార్మికులకు వికలాంగులకు 3 సెంట్లు స్థలమిచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి అలాగే రక్షణ శాఖలో పనిచేస్తున్న పోలీస్ కుటుంబాలకు ఉచిత ఇంటి సౌకర్యం కల్పించాలి మరియు వివిధ పత్రిక రంగంలో పనిచేయుచున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించాలి. చర్మ కార్మికులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు వికలాంగులకు ప్రతి కుటుంబానికి 3 ఎకరాల సాగుభూమి ఇవ్వాలి. ప్రతి మండలంలో అంబేద్కర్ సమావేశ భవనం నిర్మించాలి. తక్షణమే సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి అలాగే కొత్త పెన్షన్ల ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరగొండ జోజి, కోడుమూరు నియోజకవర్గం ఎంఎస్ పి ప్రధాన కార్యదర్శి బందారు బడేసాప్, ఎం ఎస్ పి కోసిగి మండలం అధ్యక్షులు సురేష్ మాదిగ సి.బెళగల్ మండల జనసేన నాయకులు పెమర దస్తగిరి, దళిత నాయకులు పోలకల్ మధుమోహన్(ప్రజావార్త విలేఖరి) ఎం ఎస్ పి కార్యకర్తలు దళితులు మహిళలు పాల్గొన్నారు.

# చదువు పట్ల ఆసక్తి గలవారు ఎక్కడైనా రాణిస్తారు

## . ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్ లక్ష్మారెడ్డి



**జహీరాబాద్, ఏప్రిల్ 30 ప్రజాబలం ప్రతినిధి :** చదువు పట్ల ఆసక్తి కలిగినటువంటి వారు ఎక్కడైనా రాణించగలుగుతారని ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్ లక్ష్మారెడ్డి అన్నారు తమ విద్యాసంస్థలో పదవ తరగతి విద్యను అభ్యసించిన బిజీ చిన్మాయి 600 కు గాను 586 మార్కులు సాధించే పట్టణ టాప్పర్ గా నిలిచిన సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించారు

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధిస్తారు కానీ అందులో కొందరు మాత్రమే తమకంటూ ఒక ప్రతిభను కనబరుస్తారు అందులో బిజీ చినమై పేరు ఉండడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ విధమైనటువంటి గ్రామీణ స్థాయి విద్యార్థిని విద్యార్థులు కార్పొరేట్ రేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించి తమ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు గాంచాలన్న లక్ష్యంతోనే ఇక్కడ ఆర్ ఎల్ ఆర్ విద్యాసంస్థల స్థాపించి ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులకు అక్షర జ్ఞానంతో పాటు మాణిక్యాలు లా తయారుచేసి వివిధ రంగాల్లో రాణించే విధంగా తయారు చేయడం జరిగిందని అన్నారు చిన్మాయి టౌన్ టాప్పర్ గా నిలవడం ఎంతో అభినందించదగ్గ విషయం ఇలాంటి విద్యార్థిని విద్యార్థులకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో పాటు అధ్యాపకులకు అభినందించారు

# పెట్రోల్ బంకులలో సరిపడా డిజిల్, పెట్రోలు నిల్వలు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్30:** పెట్రోల్ బంకులలో సరిపడా డిజిల్, పెట్రోలు నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందళన చెందకూడదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.

గురువారం శామీర్ పేట్ మండలంలోని తూంకుంటలోని పెట్రోల్ బంకును కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులలో సరిపడా డిజిల్, పెట్రోలు నిల్వలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. ఆయిల్ డిపోల నుండి సరఫరా కూడా సరిపోయేంత ఉన్నదని వినియోగదారులు సోషల్ మీడియాలో వార్తలు చూసి ఆందోళనకు గురికాకూడదన్నారు. పెట్రోల్ బంకులలో బారులు తీరవద్దని, ఎప్పటికప్పుడు బంకులలో ఇంధనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు వారి అవసరాల మేరకు ఇంధనం కొనుగోలు చేయాలని, ఇంధనం సరఫరా పై భయాందోళనలు చెందవద్దని సూచించారు. ఆయిల్ కంపెనీ ప్రతినిధులను బంకు యజమానులు ఇండెంట్ పెట్టిన వెంటనే వారి ఇంధనం సరఫరా అయ్యేటట్లుగా చూడవలసిందిగా, జిల్లాలో ఒక్క బంకు కూడా డ్రై అవ్వకుండా చూడాలన్నారు. బంకు యజమానులు చాలా అడ్వాన్సుగా ఆయిల్ కంపెనీలకు ఇంధనం లోడ్ కొరకు ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో బస్ షెల్టర్ల కొరత



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 30 ఏప్రియల్ 2026** మణికొండలోనీ మర్రిచెట్టు నుండి శివాలయం వరకు బస్ షెల్టర్ల కొరత తీవ్రమైన ప్రజా సమస్యగా మారింది. ప్రతి రోజు సుమారు 120 టీ.జీ.ఆ.ర్టీ.సీ బస్సులను ప్రధానంగా పేద మరియు మధ్య తరగతి ప్రజలు వినియోగిస్తున్నప్పటికీ, ఇటీవల ఉన్న బస్ షెల్టర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించడం వల్ల ప్రయాణికులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్లు తొలగించిన ప్రదేశాలు ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు సమాచారం మాత్రం ఆందోళనకరం. అలాగే మర్రిచెట్టు వద్ద బస్సులు ఆగడం వల్ల ట్రాఫిక్ మరియు భద్రతా సమస్యలు దిన దినంగా పెరుగు తున్నాయి. కాబట్టి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లేదా టీ.జీ.ఎస్.ఆర్టీసీ ద్వారా తక్షణమే బస్ షెల్టర్ల పునర్నిర్మాణం లేదా కొత్తగా ఏర్పాటు చేయడం అత్యవసరం. ప్రజా రవాణాకు కనీస సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ది సిటిజన్స్ కౌన్సిల్ స్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాళ తెలియ జేసినారు.

# అనాధ పిల్లలకు భవిష్యత్ బాట

## దత్తత ప్రక్రియలో పారదర్శకతకు శ్రీకారం

## అడాప్షన్ హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 30:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం మరియు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 30-ఏప్రిల్ 2026 రోజున జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా అడాప్షన్ హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం రోజున ప్రజా వాణి రోజున కలెక్టరేట్ ప్రాంగణానికి వచ్చే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం అవసరమైన పత్రాలను ప్రభుత్వ మార్గదర్శకాలు వంటి అంశాలను కలెక్టర్ తెలియజేశారు. దత్తత లోని



రకాలు అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల నుంచి తీసుకున్నటువంటి దత్తత గురించి, పిల్లలను దత్తత తీసుకోవాలని దంపతులకు సరైన విధానం నియమాలను నమోదు ప్రక్రియ గురించి తెలియజేశారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, ఆసుపత్రిలో గాని నర్సింగ్ హోమ్స్ లో గాని పిల్లల దత్తత ప్రక్రియ తీసుకోవడానికి ప్రవేశాలు కావు అన్నారు, పిల్లల దత్తత ప్రక్రియను ఇంటి మంచిగానే, ఆన్లైన్ సెంటర్స్ నుంచి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం మాట్లాడుతూ, ఆశా వర్కర్లకు శిక్షణలో భాగంగా స్పాన్సర్షిప్, పిల్లల దత్తత మరియు గురించి జిల్లాలోని ఆశా వర్కర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అక్రమంగా దత్తత తీసుకున్న దంపతులు ఎవరైనా ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కాల్ చేసి సమాచారం ఇవ్వగలరని వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంటాయని తెలియజేశారు. పోస్టర్ కేర్ ప్రతి ఏరియాలో ఇంటింటికి వెళ్లి మహిళలు కుటుంబాలతో మాట్లాడి దత్తత పై ఉన్న అపోహలం తొలగిస్తూ చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రక్రియ నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా అనాధ పిల్లల సంరక్షణ దత్త ప్రక్రియను అవగాహన పెంచేందుకు ఆరోగ్య విభాగం కీలక చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ప్రాంగణంలోకి తీసుకొని వచ్చామని తెలియజేశారు మిషన్ వాత్సల్య పోర్టల్ www.missionvastalya.wvd.gov.in ద్వారా పిల్లల అడాప్షన్ ప్రక్రియను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని. అక్రమ దత్తతను తీసుకున్నపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని, పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తుకు చట్టబద్ధమైన దత్తత మార్గం అణువైనదని కలెక్టర్ గారు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా అనాధ పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తు కల్పించడమే కాకుండా పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అధికారులకు తెలియజేశారు.

ఇట్టి కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల విజయ దుందుభి ఎస్ ఎస్ సి ఫలితాల్లో నూటికి నూరు శాతం ప్రభంజనం...





**ప్రజా బలం – హైదరాబాద్** పదవ తరగతి (ఎస్ఎస్సి) ఫలితాల్లో ఆల్వాల్ లో ని వెంకటాపూర్ బ్రాంచ్ విద్యాసంస్థల విద్యార్థులు మేరు శిఖర సమానమైన ప్రతిభను కనబరిచి, విజయ కేతనంపోరాడి, ఎగురవేశారు. విద్యార్థుల నిరంతర కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన బోధన వెరసి... లిటిల్ ఫ్లవర్స్ కీర్తి కిరీటంలో మరో స్వర్ణ పతకాన్ని చేర్చాయి. మెరిసిన ఆణిముత్యాలు (టాప్ స్కోరర్స్) అక్షరాయుధంతో అద్భుత మార్కులతో పాఠశాల గర్వకారణం గానిలిచిన ధీరులు వనితా, నీదిశ్రీ , శేషంక్, మానస్.వీరి ఫలితాలు పట్ల లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థ ల చెర్మన్ , కె సదానంద్, ప్రిన్సిపాల్, కె.జ్యోతి సదానంద్ లు
హర్షం వ్యక్తం చేస్తూ, ఇది విద్యార్థుల అంకితభావానికి దక్కిన ప్రతిఫలమని గర్వంగా ప్రకటించారు.
అంబరాన్నంటిన సంబరాలు: ఈ ఆజేయ విజయంతో పాఠశాల ప్రాంగణం వండుగ వాతా వరణాన్ని తలపించింది. పటాసులు పే ల్చి, మిఠాయిలు పంచుకుంటూ విజయసూచక వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థ ల చేర్మెన్ కె సదానంద్,ప్రిన్సిపాల్ జ్యుతి సదానంద్, ప్రధానోపాధ్యాయులు నాగ జ్యోతి,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు.

# కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

### శుక్రవారం పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం

### 'మేడే' సందర్భంగా కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

### గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 30 :- కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలకు వెళ్లనున్నారు. ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో పేదలకు అందించింది. ప్రతీ నెల కృష్ణాజిల్లాలో 2.34 లక్షల మందికి రూ.102 కోట్లను ప్రభుత్వం పింఛను రూపంలో ఇస్తోంది. పింఛన్ల పంపిణీ అనంతరం 'మేడే'ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణ కార్మికులతో సమావేశం అవుతారు. గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

# పోక్సో కేసు లో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

నల్గొండ మైనర్ బాలిక పై లైంగిక దాడికి యత్నించిన నిందితుడికి నల్గొండ పోక్సో కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గుంటూరు జిల్లా మాచర్ల కు చెందిన నిందితుడు దుర్గాప్రసాద్, రెండో వివాహం చేసుకున్న భార్య కూతురిపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాధిత బాలిక పిర్యాదు మేరకు నిందితుడిపై నార్కట్ పల్లి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసారు.

# బోలెరో బోల్తా డ్రైవర్ కు గాయాలు

నల్గొండ చిట్యాల (మం) గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ బస్తాల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పేలి బోల్తా పడింది. బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటనలో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవేపై బారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది...

## శ్రీ వైష్ణవి పాఠశాల విద్యార్థుల ఘనవిజయం: పదవ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణతతో సరికొత్త రికార్డు




30 ఏప్రిల్ 2026 రామచంద్రాపురం (ప్రజాబలం ప్రతినిధి) నాణ్యమైన విద్యకు నిలయమైన సంగారెడ్డి జిల్లా , రామచంద్రాపురంలోని శ్రీ వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ , పదవ తరగతి ఫలితాల్లో తమ విజయపరంపరను కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా అద్భుతమైన ఫలితాలను సాధించింది. 2012 నుండి నేటి వరకు నిరంతరాయంగా ప్రతి ఏటా 100 శాతం ఫలితాలను నమోదు చేస్తూ, విద్యా రంగంలో తన అగ్రస్థానాన్ని మరోసారి సుస్థిరం చేసుకుంది. ఈ ఏడాది ఫలితాల్లో మొత్తం 28 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. అలాగే మరో 12 మంది విద్యార్థులు 400 పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. –నాలెడ్జ్ టెస్టెడ్.. బ్రిలియన్స్ కన్ఫర్మ్– అనే పాఠశాల నినాదానికి తగ్గట్టుగా విద్యార్థులు ప్రతిభను కనబర్చడం విశేషం. విద్యార్థుల ఘనవిజయం పట్ల స్కూల్ కరస్పాండెంట్ బి. సుశీల్ వర్మ , అకడమిక్ డైరెక్టర్ హరిప్రియ హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. నిరంతర పర్యవేక్షణ, ప్రణాళికాబద్ధమైన బోధన, మరియు విద్యార్థుల క్రమశిక్షణతో కూడిన కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైంది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను, వారి తల్లిదండ్రులను కో–డైరెక్టర్ ఎం. సనత్ కుమార్ , ప్రిన్సిపల్ సోనూ కుమార్ యాదవ్ , మరియు ఇంచార్జ్ ఎం. మేఘమాల ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఐఐటీ (IIT), నీట్ (చీజుజు), సివిల్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు పునాది వేసే విధంగా నర్సరీ నుండి 10వ తరగతి వరకు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామని, ప్రస్తుతం అడ్మిషన్లు కొనసాగుతున్నాయని పాఠశాల ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు.

## జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.



**కామారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిది** గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశం మందిరం లో అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు 252 జి ఓ ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా అర్హులైన జర్నలిస్టులకు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరగాలని తెలిపారు.

ఈ సందర్భంగా అక్రిడిటేషన్ కొరకు దరఖాస్తులు చేసుకున్న వాటిని పరిశీలించి, ఈ నెల 30 వరకు ముగియనున్న అక్రిడిటేషన్ కాలపరిమితిని వచ్చే నెల మే 31 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో DPRO, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని ప్రజలకు మరింత దగ్గర చేయాలి

### నవలలు, సౌకర్యాల పెంపుపై దృష్టి -- జిల్లా గ్రంథాలయ సందర్శనలో సూచనలు

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 30:** మేడ్చల్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఈ రోజు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలోని చదువరులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి అవసరాలు, అభిరుచులు మరియు కావలసిన పుస్తకాల గురించి తెలుసుకున్నారు. చదువరుల అభ్యర్థనల మేరకు నవలలు మరింతగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయంలో నాలుగు కూలర్లు ఏర్పాటు చేయాలని గ్రంథాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. గ్రంథాలయ పరిసరాలను పచ్చదనంతో నింపేలా చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. అదనంగా, పాఠకులతో వారు చదువుతున్న విధానం గురించి విచారించి, గ్రంథాలయ అభివృద్ధి కోసం ప్రతి నెల స్వయంగా సందర్శిస్తానని తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది లేకపోయినప్పటికీ, గ్రంథాలయాన్ని సమర్థంగా నిర్వహిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు.



ఈ కార్యక్రమంలో శ్రీమతి ఎం. నాగవేణి మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా సిద్ధం...

### జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఏప్రిల్ 30** జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

గురువారం జిల్లా కలెక్టరెట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ

జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు.

జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26





నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 545 మంది ఎన్యుమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు.

స్వీయ నమోదు కోసం పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు.

ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు.

జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు.

ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.

ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ జనగణన పర్యవేక్షకులు, తదితరులు

## మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలోఈసి విట్టల్ రావు పదవీ విరమణ లో ఘనంగా సన్మానించిన సిబ్బంది నాయకులు




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందుతున్న ఈసీ విట్టల్ రావు నీ అధికారులు నాయకులు సిబ్బంది పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని పూలమాల సమర్పించి శాలువాతో సన్మానించి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని సంతోషం వ్యక్తపరిచారు కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అంజిరెడ్డి, సీనియర్ సర్పంచ్ రప్పియోద్దీన్, పట్లూర్ సర్పంచ్ పరు శురాం, జిల్లాస్థాయి సిబ్బంది కూడా పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న టు తెలిపారు



## అధైర్యం చెందొద్దు అండగా నేనుంటా

### తుమ్మ అమృత కు 2,50,000 రూపాయల ఎల్ ఓ సి చెక్కును అందజేసిన మంత్రి సీతక్క



VEMULA SRINIVASULU,
LLM., MBA.,
O.S.D. TO CHIEF MINISTER
GOVERNMENT OF TELANGANA

Room No.3, 6th Floor,
Dr.B.R.Ambedkar Telangana
Secretariat Hyderabad.
Ph.No. 040-23450466
Fax No. 040-23459944

CHIEF MINISTER'S OFFICE

Lr. No.5196/CMRF-LOC/2026. Dated:28-04-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SMT DANASARI ANASUYA SEETHAKKA, Hon'ble MINISTER FOR PR&RD, RWS, WOMEN & CHILD WELFARE, dt.:25-04-2026

@@@

The Hon'ble Chief Minister desires that the treatment of THUMMA AMRUTHA VARSHINI, D/O ARUN REDDY, ETURNAGARAM,MULUGU, MULUG to be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs.2,50,000/- (Rupees Two Lakh Fifty Thousand Only) to undergo DETETHERING .

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,

(Vemula Srinivasulu)

Copy to:
SMT DANASARI ANASUYA SEETHAKKA,
Hon'ble MINISTER FOR PR&RD, RWS, WOMEN & CHILD WELFARE

Copy to:
THUMMA AMRUTHA VARSHINI,
D/O ARUN REDDY,
ETURNAGARAM,MULUGU, MULUG

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** ములుగు గురువారం ఈ రోజున ములుగు జిల్లా,ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన తుమ్మ అర్జున్ రెడ్డి కుమార్తె అమృత వర్షిణి గత కొద్ది రోజుల నుండి అనారోగ్యం తో బాధపడుతూ పంజాగుట్ట లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఈ విషయం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి ఓ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రెండు లక్షల యాభై వేల రూపాయలు ఎల్ ఓ సి నీ వాళ్ళ తండ్రి గారైన అర్జున్ కు అందజేశారు.దీనితో ఆ కుటుంబ సభ్యులు మంత్రి గారిని కృతజ్ఞతలు తెలియజేశారు

# తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ నియామకంతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న హోంగార్డ్స్ సంఘము నాయకులు




తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయం మేరకు ప్రస్తుత డీజీపీ స్థానంలో ఆయన పగ్గాలు చేపట్టనున్నారు.

1991 బ్యాచ్‌కు చెందిన ఈ సీనియర్ అధికారికి మంచి గుర్తింపు ఉంది.

సీవీ ఆనంద్ తన సుదీర్ఘ సర్వీసులో అనేక కీలక పదవులను అధిష్టించారు. ముఖ్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా ఆయన చేసిన సేవలు, పరిష్కరించిన కేసుల గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో, డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ఆయన వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టారు. గతంలో ఆయన సైబరాబాద్ కమిషనర్‌గా, ఇతర కీలక పదవుల్లో పనిచేశారు.

ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న విషయం తెలిసిందే. డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి యూపీఎస్సీ పంపించింది. దీనిలో సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఇందులో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సీవీ ఆనంద్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. శాంతిభద్రతల నిర్వహణలో కఠినంగా ఉంటూనే, ప్రజలకు చేరువయ్యేలా పోలీసింగ్ ఉండాలని ప్రభుత్వం ఆశిస్తోంది. సీవీ ఆనంద్ నియామకంతో పోలీస్ శాఖలో మరిన్ని సంస్కరణలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే కొత్త డీజీపీ సీవీ ఆనంద్ ముందు పలు సవాళ్లు కూడా ఉన్నాయి. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అయిపోయాయి. వీటి కట్టడికి సీవీ ఆనంద్ చర్యలు తీసుకోవాలి, పెరిగిపోతున్న సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రణాళికలు వేయాలి. మత్తు పదార్థాల నిర్మూలనపై కూడా ఉక్కుపాదం మోపాలి. యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘాను పెంచాలి.

సమర్థవంతమైన అధికారిగా పేరున్న సీవీ ఆనంద్ నేతృత్వంలో తెలంగాణ పోలీస్ శాఖ మరింత కొత్త నిర్ణయాలతో పనిచేస్తుందని పోలీస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. సీవీ ఆనంద్ నియామకం పట్ల పలువురు ఉన్నతాధికారులు, తెలంగాణ స్టేట్ హోంగార్డ్స్ సంఘము మరియు ప్రముఖ సంఘసంస్కర్తలు అభినందనలు తెలియజేశారు.

# మర్పల్లి ఈసీ విట్టల్ రావుపదవి విరమణ లో అధికారుల ప్రశంసలు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా** మర్పల్లి మండల పరిధిలో ఈసీగా విధులు నిర్వహించి ఈరోజు పదవి విరమణ కార్యక్రమంలో అధికారులు పాల్గొని శాలువాతో సన్మానించి పూలమాల సమర్పించి సంతోషం వ్యక్తపరిచారు చాలా చక్కగా పనిచేసేవారు పై అధికారులతో ఎంతో అన్యోన్యంగా ఆప్యాయంగా పలకరించేవారు ఎదుటి వ్యక్తిని ఎంతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడేవారు ఒక రకంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఇది సర్వసాధారణమే కానీ విఠల్రావు పదవి విరమణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్,ఏపీఓ అంజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమంలో ఎంతో కాలం నుండి కలిసిమెలిసి ఉండి ఈరోజు పదవి విరమణ అనే ఒక అధికార ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినప్పటికీ చాలా బాధాకరంగా ఉందని అధికారులు ఆవేదన వ్యక్తపరుస్తూ ఏది ఏమైనా ఈసీ విట్టల్ రావు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడిసిపోయిన కాలమంతా జ్ఞాపకం చేసుకుంటూ ఆ మధుర అనుభూతిలో వారు మిగిలిన జీవితకాలమంతా కూడా సంతోషంగా సమాధానంతో నిండు నూరేళ్లు హ్యాపీ జర్నీ చేయాలని మర్పల్లి ఎంపీడీవో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీఓ అంజిరెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు కార్యక్రమంలో పాల్గొని గ్రీటింగ్స్ తెలిపారు అదేవిధంగా వారి స్టాఫ్ టి ఏ లు ఫీల్డ్ అసిస్టెంట్లు శాలువాతో సన్మానించి పూలమాల సమర్పించి ఈసి విఠల్రావు దంపతులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని సంతోషం వ్యక్తపరిచారు



# పిల్లల్లో సమస్యలపై అవగాహన & నాయకత్వ లక్షణాలను పెంచడం కోసమే బాలల గ్రామ సభలు.

## జిల్లా సంక్షేమాధికారి - శ్రీమతి ప్రేమలత.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధిఏప్రిల్ 30** ములుగు గురువారం ములుగు జిల్లాలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఏ. ఓంకార్ పర్యవేక్షణలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజు ప్రత్యేక కార్యాచరణ)లో బాలల సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా బాలల గ్రామ




సభలను నిర్వహించడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి ఇ.ఖ.ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు.మహిళాభివృద్ధి ఒ శిశు సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, మహిళా సాధికారత కేంద్రం, సఖి మొదలైన విభాగాల సిబ్బంది ఈ కార్యక్రమాలను పంచాయతీరాజ్ శాఖ, మండల మరియు గ్రామస్థాయి అధికారుల సహకారంతో విజయవంతంగా నిర్వహించారని అన్నారు. ఈ సందర్భంగా బాలల గ్రామ సభలను నిర్వహించడం ద్వారా బాలలు తమ అభివృద్ధికి నిర్ణయాలు తీసుకునే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వారికి ఉంటుందని, తద్వారా వారిలో తమ సమస్యలపై నిర్భయంగా మాట్లాడే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ఈ సభల్లో పాల్గొని మాట్లాడడం ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. బాలలు తమ సమస్యను తామే ఎలా పరిష్కరించుకోవాలనే విషయం పై స్పష్టత వస్తుందని అన్నారు.జిల్లా పంచాయతీ శాఖ సమన్వయంతో నిర్వహించిన ఈ బాలల గ్రామ సభల్లో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు ఒ గ్రామ పంచాయతీ పాలక సభ్యులు, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు, బాలలు వారి తల్లితండ్రులు ఒ గ్రామస్థులు హాజరు అయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ రోజు 132 గ్రామ పంచాయితీల్లో బాలల గ్రామ సభలు నిర్వహించగా, ఆయా గ్రామాల్లోనీ బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు ఈ బాలల గ్రామ సభల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.

# టియూడబ్ల్యూజే (ఐజేయూ ) యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

## యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** ములుగు టి యు డబ్ల్యూ జే (ఐ జే యూ ) యూనియన్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బస్సాపూర్ సమీపంలోని “విరించి “ రిసార్ట్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసుదేవ్ ల అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మండలంలో ఐజేయూ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. మే 15న ములుగు జిల్లా కేంద్రంలో ఐజేయు మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సంఘం సభ్యులను అధిక సంఖ్యలో తరలించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇట్టి మహాసభ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఐజయు నాయకత్వం కలిసికట్టుగా మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై ఆయన స్థానిక యూనియన్ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఐజేయు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎలగందుల కొమురయ్య జిల్లా ఉపాధ్యక్షులు భేతి సతీష్ యాదవ్. గంపల శివ సంయుక్త కార్యదర్శి చుంచు రమేష్. గూగుల మోడీ హరికృష్ణ కోశాధికారి బైకానీ నటరాజ్. దాడుల వ్యతిరేక కన్వీనర్ జాలిగం శ్రీనివాస్ చిన్న పత్రికల ప్రధాన కార్యదర్శి. ఎనుగందుల. శంకర్. జింకల ప్రభాకర్. గోల్కొండ రాజు.ముంద్రాతి ప్రతాప్. కుదురుపాక ప్రవీణ్ అశోక్. పతంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# వికారాబాద్ జిల్లా ప్రజలకు మే డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్30 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ జిల్లా ప్రజలకు మేడే 01 05 2026సందర్భంగా శ్రామిక శ్రమజీవులు కార్మిక సహోదరులకు మేడే సందర్భంగా శుభాకాంక్షలు తెలియపరుస్తున్నాను అని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ కె ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టరేట్ అవార్డు గ్రహీత సన్న గారి కొండల్ రెడ్డి తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com